## రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను త్వరగా పూర్తి చేయాలి



చిన్నగొట్టిగల్లు, మే 6 ప్రభాతవార్త : రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్‌ను పూర్తి చేయాలని మాజీ మంత్రి శైలజానాద్ అన్నారు. వైసిపి విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో భాకరాపేట సమీపం లోని లేక్ వ్యూ కళ్యాణ మండపంలో రాయలసీమ ఎత్తిపోతల పథకంపై సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో రాయలసీమకు త్రాగునీరు, సాగునీరు ఇబ్బంది లేకుండా ఉండాలంటే లిఫ్ట్ ఇరిగేషన్ పూర్తి చేయాలన్నారు. శ్రీశైలం ప్రాజెక్టులో 854 అడుగులకు తగ్గకుండా నీరు ఉంటేనే పోతిరెడ్డిపాడు మరియు తెలంగాణకు నీరు విడుదల చేసే అవకాశం ఉంటుందన్నారు. తెలంగాణ నిబంధనలు పాటించకుండా శ్రీశైలం నుండి నీటిని అక్రమంగా తరలించుకుని పోతున్నదన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి చంద్రగిరి ఇంచార్జ్ మోహిత్ రెడ్డి విద్యార్థి విభాగం కోఆర్డినేటర్ హర్షిత్ రెడ్డి పానుగంటి చైతన్య తదితరులు పాల్గొన్నారు.


# తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

30 ఏళ్ల ప్రస్థానం వార్త 30 వార్షికోత్సవం 1996 - 2026


## పిడుగుపాటుకు గొర్రెల కాపరి బలి



పెళ్లకూరు, మే 6 ప్రభాతవార్త: రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబానికి చెందిన సంచి సిద్ధార్థన (48) బుధవారం పిడుగుపాటు గురై మృతి చెందాడు. శిరసనం బేడు గ్రామానికి చెందిన సంచి సిద్ధార్థన బుధవారం గొర్రెల మందను తీసుకుని మేపుకోసమని పొలంలోకి వెళ్ళగా ఒక్కసారిగా ఉరుపులు మెరుపులతో కూడిన జల్లులకు పిడుగు పడడంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందాడు. మృతుడు సిద్ధార్థనకు భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. అనుకోకుండా జరిగిన ఈ విషాద సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. నిరుపేద కుటుంబానికి చెందిన ఆ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకూ

## శ్రీవారి దర్శనం, లడ్డూ కార్డు

**-రూ.6 కోట్లతో అదనపు పైపులైన్**

**-రూ.3.61 కోట్లతో వరాహస్వామి విశ్రాంతి భవనం అభివృద్ధి**

**-పాలనా సౌలభ్యం కోసం ఒకేచోటుకు అన్ని కార్యాలయాలు**



తిరుమల,మే 6ప్రభాతవార్తప్రతినిధి: ధార్మికసంస్థ టిటిడిలో శాశ్వత ఉద్యోగులతో సమానంగా సేవలందిస్తున్న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ శ్రీవారి దర్శనం, లడ్డూ కార్డు జారీ చేయాలని నిర్ణయించారు. కొండపై నీటి వృధాను అరికట్టేందుకు, రోజు రోజుకు పెరుగుతున్న నీటి అవసరాల దృష్ట్యా గోగర్భం డ్యామ్ నుండి ఫిల్టర్ ప్లాంట్ వరకు 6 కోట్లతో దాదాపు రెండు కిలో మీటర్ల వరకు అదనపు పైపులైన్ ఏర్పాటు చేయనున్నారు. వరాహస్వామి విశ్రాంతి భవనం -1లో 3.61 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించారు. తిరుమలలో పాలనా సౌలభ్యం కోసం అన్ని కార్యాలయాలను ఒకే చోటు తీసుకొచ్చేందుకు నూతనంగా పరిపాలనా భవనాన్ని నిర్మించాలని తీర్మానించారు. బుధవారం తిరుమల అన్నమయ్యభవనంలో టిటిడి ఛైర్మన్ బిఆర్ నాయుడు అధ్యక్షతన పాలకమండలి సమావేశం జరిగింది. టిటిడి ఈఓ ముద్దాడ రవిచంద్ర, అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి, జెఈఓ వి.వీరబ్రహ్మం,సివిఎస్ఓ కెవి మురళీకృష్ణ, బోర్డు సభ్యులతో కలసి నాలుగుగంటలు పాటు చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు. అలిపిరి వద్ద 4.75 కోట్లతో శ్రీశ్రీనివాస దివ్యానుగ్రహ హోమం కోసం యాగశాల నిర్మించాలని నిర్ణయించారు. టిటిడి ఉద్యోగులకు హెల్త్ స్కీమ్ లో భాగంగా ఇప్పటికే విడుదల చేస్తున్న మూడు లక్షల రూపాయలకు అదనంగా మరో రెండు లక్షల రూపాయలు రీఎంబర్స్మెంట్ చేసేందుకు ఆమోదం తెలిపారు. అలిపిరి టోల్ గేట్ వద్ద వాహనాల రద్దీని తగ్గించేందుకు అలిపిరిలో వినాయకస్వామి ఆలయ సమీపంలో 4.25 కోట్లతో బస్సుల తనిఖీల కోసం శాశ్వత షెల్టర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. శ్రవణం ప్రాజెక్టులో శిక్షణ పొందుతున్న వినికిడి లోపం గల 150 మంది పిల్లలకు ఉచితంగా వినికిడి యంత్రాలు ఇచ్చేందుకు ఆమోదం. తిరుమల ఆళ్వార్ ట్యాంక్ అతిథి గృహం సర్కిల్ నుండి బాట గంగమ్మ సర్కిల్ వరకు ఉన్న సర్వదర్శనం క్యూలైన్లలో 4.55 కోట్లతో అదనపు మరుగుదొడ్లు నిర్మించేందుకు ఆమోదించారు. అలాగే కొండపై రోడ్లు, సర్కిళ్లకు కమిటీ సూచించిన ఆధ్యాత్మిక, పురాణ ప్రాశస్త్యం కలిగిన పేర్లను పెట్టేందుకు అంగీకరించారు. ఈ సమావేశంలో బోర్డు సభ్యులు జి.భానుప్రకాశ్‌రెడ్డి, సి.దివాకర్‌రెడ్డి, జ్యోతులనెహ్రూ, పనబాకలక్ష్మి, వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, నర్సిరెడ్డి, ఎంఎస్‌రాజు. జాస్తి సాంబశివరావు, సదాశివరావు, దర్శన్,జానకిదేవి, నరేశ్‌కుమార్ తదితరులతో కలసి 82 అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు.

# గ్లోబల్ తయారీ కేంద్రంగా శ్రీసిటీ

### శ్రీసిటీలో క్యారియర్ ఏసీ పరిశ్రమకు శంకుస్థాపన చేసిన మంత్రి లోకేష్









సత్యవేడు, మే 6 ప్రభాతవార్త: ఏపీకి అంతర్జాతీయ పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. సత్యవేడు నియోజకవర్గం శ్రీసిటీ పారిశ్రామికవాడలో బుధవారం ఉదయం అమెరికాకు చెందిన దిగ్గజ ఎయిర్ కండిషనర్ తయారీ సంస్థ క్యారియర్ ఏసీ తయారీ యూనిట్‌కి విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ శంకుస్థాపన చేశారు. ముందుగా వేదిక ప్రాంగణానికి చేరుకున్న మంత్రి లోకేష్‌కు సంస్థ ప్రతినిధులు ఘన స్వాగతం పలికారు. అనంతరం క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఛైర్మన్, ఈసీవో డేవిడ్ ఎల్ గిట్లిన్‌తో కలసి మంత్రి లోకేష్ క్యారియర్ ఏసీ తయారీ పరిశ్రమకు భూమిపూజ చేశారు. అనంతరం సంస్థ ప్రతినిధులతో కలసి గ్రూప్ ఫోటో దిగారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ భారతదేశంలోని చురుకైన పారిశ్రామిక ఎకోసిస్టమ్ లలో ఒకటైన శ్రీసిటీలో నేడు ఈ చారిత్రాత్మక కార్యక్రమంలో పాల్గొనడం గౌరవంగా ఉందన్నారు. ఈ రోజు కేవలం ఒక ప్రాజెక్టును ప్రారంభించడం మాత్రమే కాదు, భారతదేశ డిజిటల్ మరియు తి। అభివృద్ధి యొక్క తదుపరి అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. క్యారియర్ సంస్థ నాయకత్వానికి శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, క్యారియర్ కేవలం ఒక కంపెనీ కాదు, ప్రపంచం శీతలీకరణ ఆలోచన విధానాన్ని మార్చిన పయనీర్ సంస్థగా అభివర్ణించారు. "నా మొదటి ఎయిర్ కండిషనర్ కూడా క్యారియర్‌దే. కాబట్టి ఇది కేవలం వ్యాపార సంబంధం కాదు, ప్రత్యేకమైన అనుబంధం. మోడ్రన్ ఎయిర్ కండిషనింగ్‌ను కనిపెట్టడం నుండి !!50 బిలియన్ గ్లోబల్ సంస్థగా ఎదగడం వరకు క్యారియర్ ఎప్పుడూ ఆవిష్కరణలో ముందంజలో ఉంది. ఇప్పుడు ఆ ఆవిష్కరణ మన రాష్ట్రానికి వస్తోంది. దీని ద్వారా ..1000 కోట్ల పెట్టుబడి సుమారు 3,000 స్థానిక ఉద్యోగాలను సృష్టిస్తుంది. ఇది మన రాష్ట్రం, మన ఎకోసిస్టమ్ మరియు మన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంపై నమ్మకానికి నిదర్శనం" అని మంత్రి వ్యాఖ్యానించారు. దేశంలో క్యారియర్ సంస్థ కార్యకలాపాలు ఐదు దశాబ్దాలకుపైగా కొనసాగుతున్నాయి. హర్యానాలోని గుర్ గ్రామ్‌లో తయారీ యూనిట్, హైదరాబాద్‌లో గ్లోబల్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ ను ఈ సంస్థ కలిగి ఉంది. ఏసీ తయారీ రంగంలో పేరుగాంచిన క్యారియర్ గ్లోబల్ రూ.వెయ్యి కోట్ల పెట్టుబడితో శ్రీసిటీలో అత్యాధునిక తయారీ యూనిట్‌ను స్థాపించనుంది. ఈ ప్లాంట్ హెచ్‌వీ ఏపీ(హెచ్‌వీఏసీ) సంబంధిత ఉత్పత్తులపై పెరుగుతున్న డిమాండ్‌ని తీర్చడమే కాకుండా కార్యకలాపాల సామర్థ్యాన్ని విస్తృతిని పెంచనుంది. శ్రీసిటీ పరిధిలోని ఆరూరు వద్ద ఈ పరిశ్రమకు 39 ఎకరాలను ప్రజా ప్రభుత్వం కేటాయించిందన్నారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ, క్యారియర్ శ్రీసిటీని ఎంపిక చేసుకోవడం గర్వకారణమని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ భారతదేశ అభివృద్ధి దిశగా క్యారియర్ నమ్మకాన్ని ప్రతిబింబిస్తోందని, స్థానిక నైపుణ్యాభివృద్ధి మరియు సుస్థిర పారిశ్రామిక వృద్ధికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. కాగా, 39 ఎకరాల విస్తీర్ణంలో ఏర్పడనున్న ఈ యూనిట్‌లో అధునాతన చిల్లర్లు తయారు చేయనున్నారు. ఐదు సముద్ర తీర నౌకాశ్రయాలకు సమీపంలో ఉండటం వల్ల ఎగుమతులకు అనుకూలంగా మారనుంది. వచ్చే ఏడాది చివరి నాటికి కార్యకలాపాలు ప్రారంభించే ఈ ప్లాంట్ ద్వారా సుమారు 3,000 ప్రత్యక్ష, పరోక్ష ఉద్యోగాలు సృష్టించబడనున్నాయి. అలాగే గ్రీన్ మాన్యుఫాక్చరింగ్ విధానాలతో శక్తి సామర్థ్యం గల కూలింగ్ సొల్యూషన్ల తయారీకి ఇది కేంద్రంగా మారనుందన్నారు. కార్యక్రమంలో క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఛైర్మన్ అండ్ సీఈవో డేవిడ్ ఎల్.గిట్లిన్, క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ క్లైమేట్ సొల్యూషన్స్ ఏసియా పసిఫిక్, మిడిల్ ఈస్ట్ అండ్ ఆఫ్రికా ప్రెసిడెంట్ మేకేల్ ఎల్.గియర్జెస్, క్యారియర్ ఎయిర్ కండిషనింగ్ అండ్ రిఫ్రిజిరేషన్ లిమిటెడ్(క్యారియర్ ఇండియా) మేనేజింగ్ డైరెక్టర్ సుందరేశన్ నారాయణన్, రెవెన్యూశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, జేసీ ఆర్.గోవిందరావు, క్యారియర్ గ్లోబల్ కార్పొరేషన్ ఆపరేషన్స్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మైక్ దుయిజర్, చీఫ్ పీపుల్ అండ్ కమ్యూనికేషన్స్ ఆఫీసర్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నడియా విల్లెనెవ్, తదితరులు పాల్గొన్నారు.

## ఒక నెల ఒక గ్రామం - నాలుగు సందర్శనలు..

### రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక కార్యక్రమం

### జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్




తిరుపతి కలెక్టరేట్, మే 6 ప్రభాతవార్త: జిల్లాలో గ్రామస్థాయి రెవెన్యూ సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు "ఒక నెల - ఒక గ్రామం, నాలుగు సందర్శనలు" అనే ప్రత్యేక కార్యక్రమాన్ని రేపటి నుంచి ప్రారంభిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. 2026 మే నెల మొదటి గురువారం నుంచి ఈ కార్యక్రమం అమలులోకి వస్తుందని ప్రతి నెలలో ఎంపిక చేసిన ఒక గ్రామాన్ని ప్రతి గురువారం అధికారుల బృందం నాలుగు సార్లు సందర్శించి గ్రామ సభలు నిర్వహించడం, ప్రజల అర్జీలు స్వీకరించడం, ఫీల్డ్ స్థాయిలో పరిశీలనలు చేయడం, సమగ్ర విచారణ చేపట్టి సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకుంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్, ఎంపీడీవో, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్, మండల సర్వేయర్, ఇరిగేషన్ , పంచాయతీరాజ్ ఏఈలు, వీఆర్వో, గ్రామ సర్వేయర్ తో పాటు అవసరాన్ని బట్టి ఫారెస్ట్, దేవాదాయ శాఖ అధికారులు పాల్గొంటారని చెప్పారు. గ్రామ సభలో రెవెన్యూ రికార్డులు ప్రజలకు వివరించడంతో పాటు అసైన్మెంట్ భూములు, 22ఏ జాబితా, భూ సేకరణ భూములు, చెరువులు, ప్రభుత్వ భూముల వివరాలు తెలియజేస్తారని పేర్కొన్నారు.

భూములకు సంబంధించిన మ్యుటేషన్ , రీసర్వే, హద్దులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలు, 22ఏ జాబితా, చుక్కల భూములు తదితర సమస్యలపై అర్జీలు స్వీకరించి, స్థల పరిశీలన చేసి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. గ్రామ స్థాయిలో ఈ కార్యక్రమాన్ని జాయింట్ కలెక్టర్, ఆర్ డి ఓ లు పర్యవేక్షి స్తారని తెలిపారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ప్రతి గురువారం ఎంపిక చేసిన గ్రామాల్లో ఈ కార్యక్రమం నిర్వహించబడుతుందని, ప్రజలు మరియు ప్రజా ప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని చేయాలన్నారు.

## పరీక్ష రాయాలంటే ...పెను భారమే...!

**నగరం లో పి జి సెట్ పరీక్ష కేంద్ర ఎక్కడ ?**

**జిల్లా అభ్యర్థులకు వలస తప్పదా ....**

**పీజీ సెట్ పరీక్ష రాయాలంటే రూ. 5 వేలు ఉండాల్సిందే**

**పరీక్ష కేంద్రాల ఏర్పాటుపై వెల్లువెత్తుతున్న విమర్శలు**



తిరుపతి విద్య మే 6 ప్రభాతవార్త ఉన్నత విద్యామండలి నిరక్ష్యంపై తిరుపతి విద్యార్థుల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. విద్యా కేంద్రంగా పేరుగాంచిన తిరుపతిలో పరిస్థితి ఇలా మారడం పట్ల ఆందోళన వ్యక్తమవుతోంది. నగరంలో ఆరు యూనివర్సిటీలతో పాటు వేలాది మంది విద్యార్థులు చదువుకుంటుండగా, ఐఐటీ, ఐజర్ వంటి కేంద్ర ప్రభుత్వ విద్యాసంస్థలు, అనేక కార్పొరేట్ కాలేజీలు ఉండటం తిరుపతికి ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చాయి. సివిల్స్ వంటి ప్రతిష్టాత్మక పరీక్షలకు కూడా తిరుపతి కేంద్రంగా నిలిచిన విషయం తెలిసిందే.అయితే, అలాంటి నగరంలోనే ఏపీ పీజీసెట్2026 ప్రవేశ పరీక్షకు సంబంధించి ఒక్క పరీక్షా కేంద్రం కూడా కేటాయించకపోవడం విద్యార్థుల్లో తీవ్ర ఆవేదన కలిగిస్తోంది. తిరుపతి జిల్లాలో ఎక్కడా సెంటర్ ఏర్పాటు చేయకపోవడంతో, వేలాది మంది అభ్యర్థులు పక్క జిల్లాలకు వెళ్లి పరీక్ష రాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ కారణంగా సమయం, ఖర్చు, ప్రయాణ ఇబ్బందులు పెరిగి విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.విద్యా హబ్‌గా ఎదిగిన తిరుపతికి ఈ పరిస్థితి తగదని, కనీసం ఒక పరీక్షా కేంద్రాన్ని ఏర్పాటు చేయాల్సిందిగా విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు.

### పక్క జిల్లాకు వలస తప్పడం లేదు

రాష్ట్రంలోని పలు విశ్వవిద్యాలయాల్లో పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీపీజీసెట్‌కు ఈ సంవత్సరం తిరుపతి జిల్లా నుంచి సుమారు 3 వేల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. అయితే, ఆశ్చర్యకరంగా జిల్లాలో ఒక్క పరీక్షా కేంద్రం కూడా ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.దీంతో అభ్యర్థులను వైఎస్సార్ కడప, నెల్లూరు, చిత్తూరు జిల్లాల్లోని పరీక్షా కేంద్రాలకు కేటాయించారు. శుక్రవారం నుంచి పరీక్షలు ప్రారంభం కానున్న నేపథ్యంలో, దూర ప్రాంతాలకు వెళ్లాల్సి రావడంతో విద్యార్థులు ఒక రోజు ముందుగానే చేరుకుని అక్కడే వసతి ఏర్పాట్లు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.ప్రయాణ ఖర్చులు, హోటల్ వసతి తదితరాలతో ఒక్కో అభ్యర్థికి కనీసం రూ.5 వేల వరకు వ్యయం అవుతోందని విద్యార్థులు వాపోతున్నారు. పరీక్ష రాయడమే కాకుండా ఈ అదనపు భారం వారిపై పడడం అన్యాయమని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం చంద్రబాబు

### నేతన్నల ఇళ్లలో ఉచిత విద్యుత్ వెలుగులు

### ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్




బహిరంగ సభలో మాట్లాడుతున్న భానుప్రకాశ్

పుత్తూరు, మే 6 ప్రభాతవార్త : ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికలపుడు చేనేత, మరమగ్గాల కార్మికులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. ఎన్నికల సమయంలో నగరిలో జరిగిన బహిరంగసభలో తాను చంద్రబాబునాయుడుతో మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ హామీ ఇప్పించిన విషయాన్ని గుర్తు చేశారు. మరమగ్గాలకు నెలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇచ్చిన సందర్భంగా పుత్తూరులో బుధవారం వేలాది మంది పవర్ లూమ్ కార్మికులతో జరిగిన బహిరంగ సభలో ఎమ్మెల్యేను భారీ స్థాయిలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉచిత విద్యుత్ వల్ల మగ్గం నేసే నేతన్నకు నెలకు రూ. 720, మరమగ్గాల కార్మికుడికి నెలకు రూ. 2,800 వరకూ ఆదా అవుతుందని తెలిపారు. పవర్‌లూమ్ కార్మికులు ఎన్నో ఏళ్లుగా ఎదురుచూసిన ఉచిత విద్యుత్ కల నేడు సాకారమైందన్నారు. పవర్‌లూమ్ కార్మికుల చిరకాల కోరికను చంద్రబాబునాయుడు మాత్రమే తీర్చారని తెలిపారు. నేతన్నల గుండెల్లో చంద్రబాబు శాశ్వతంగా నిలిచిపోతారని తెలిపారు. వస్త్రాల తయారీకి అవసరమైన నూలు, రంగులు తదితర ముడి సరుకుల ధరలు బహిరంగ మార్కెట్లో నానాటికీ పెరిగిపోతున్న నేపథ్యంలో కరెంట్ ఛార్జీల వల్ల మరమగ్గాలు మూతపడే స్థాయికి పరిస్థితి దిగజారిపోయిందన్నారు. ఆ నేపథ్యంలో మొదటిసారిగా గతంలో తన తండ్రి దివంగత నాయకుడు గాలి ముద్దుకృష్ణమనాయుడు పవర్‌లూమ్ కార్మికులకు ఉచిత విద్యుత్ సదుపాయం కల్పించాలని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని తెలిపారు. ఆ రోజు ముద్దన్న ఇచ్చిన మాట నేడు చంద్రబాబు వల్ల అమలు కావడం సంతోషంగా వుందని పేర్కొన్నారు. ఈ పథకం ద్వారా నగరిలో 3418, పుత్తూరులో 808 పవర్‌లూమ్ కనెక్షన్లకు లబ్ది చేకూరుతుందన్నారు. మొత్తం 4,226 మంది మరమగ్గ కార్మికులకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ద్వారా నెలకు రూ. 2,800 వేల వరకూ విద్యుత్ ఛార్జీల రుసుము మిగులుతుందని ఫలితంగా నగరి నియోజకవర్గంలో నెలకు ఒక కోటి రూపాయల వరకూ చేనేత, పవర్ లూమ్ కార్మికులకు కూటమి ప్రభుత్వం సబ్సిడీ ఇస్తోందని వివరించారు. అనంతరం పలువురు నాయకులు ఎమ్మెల్యే భానుప్రకాశ్‌ను గజమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ చిత్తూరు జిల్లా అధ్యక్షుడు చెక్కుడుకుప్పం షణ్ముగరెడ్డి, పుత్తూరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ డి.ఎస్.గణేష్, పట్టణ పార్టీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గాలి జీవరత్నంనాయుడు, ఎన్.ఎన్.ధనపాల్, నాయకులు డి.ఎన్.ఏలుమలై (అమ్ములు), ఎం.ఎస్.కరుణాకరన్, బి.ఆర్.యుగంధర్, ఆనంగి ఆనంద్, రావిళ్ల మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## గంగమ్మా... నీ దరికీ దారేదీ!?

**అష్టదిగ్బంధనంలో గంగమ్మ ఆలయం**

**ఎటూ వెళ్ళాలో...ఎలా చేరాలో తెలియని ఇబ్బందులు**

**ప్రధాన జాతరకు ముందే పోలీసుల అత్యుత్సాహం**




తిరుపతి,మే 6ప్రభాతవార్తప్రతినిధి: పదులు...వందల సంఖ్యలో కాదు వేలసంఖ్యలో నిత్యం తిరుపతిజనం రాకపోకలు సాగించే ప్రధాన మార్గం నగరగ్రామదేవత తాతయ్యగుంట గంగమ్మ ఆలయం కొలువైన ప్రాంతం అష్టదిగ్బంధనంలో ఇరుక్కుంది. నగరవాసులేగాక ఆలయంకు వెళ్ళాల్సిన భక్తులు చివరకు ఆలయ అర్చకులు కూడా ఎటు నుండి వెళ్ళాలో...ఎలా చేరుకోవాలో తెలియని ఇబ్బందులు పడుతున్నారు. ఇదంతా కొందరు తిరుపతి పోలీసుల అత్యుత్సాహంతోనే ఇలా గంగమ్మ జాతరకు వారంరోజుల ముందే కష్టాలు చవిచూడాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో 2023,2024,2025లో గంగమ్మజాతర జరిగిన సందర్భాల్లోనూ ఏకంగా స్వయంగా అప్పటి రాష్ట్రమంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు భారీ సంఖ్యలో ఆలయానికి చేరుకుని గంగమ్మకు సారె సమర్పించినపుడు కూడా ఇంతటి కష్టాలు కలగలేదని తిరుపతి జనం తిట్టుకుంటున్నారు.జాతరవేడుకలు మొదలైన తొలి ఐదురోజులవరకు పెద్దగా భక్తుల తాకిడి ఉండదు. తిరుపతి నగరవాసులతోబాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మొక్కుబడుల్లో భాగంగా పలు రకాల వేషధారణలతో వచ్చి గంగమ్మను దర్శించుకుంటారు.కొందరు సాధారణంగానే అమ్మవారిని దర్శించుకోవడం పరిపాటి. ఈ ఏడాది అదే రీతిన తిరుపతిలో గంగమ్మజాతర నిర్ణయించిన సమయంలో,నిర్ణయించిన ఘడియలకే మొదలైంది. మంగళవారం రాత్రి చాటింపుతో ప్రారంభమైన గంగమ్మజాతర బుధవారం ఉదయానికి ఆలయం పరిసరాలు చుట్టూ భారీ కేడ్లతో అష్టదిగ్బంధనంలో ఇరుక్కుపోయాయి. ఏదో అవాంఛనీయ సంఘటనలు జరిగినట్లు, తీవ్ర ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నట్లు ఏదో కర్ఫ్యూ అమలవుతున్నట్లు మార్చేశారు. తిరుపతిలో ప్రధానంగా ఆర్టీసి బస్టాండ్, రైల్వేస్టేషన్ నుండి యాత్రికులు, నగరవాసులు అలిపిరి, తుడ కార్యాలయం, ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ చేరుకోవడానికి గంగమ్మ ఆలయం మార్గం ప్రధానం. ఈ మార్గం బుధవారం ఉదయానికి ప్రధాన తపాల కార్యాలయంవెళ్ళే కూడలి నుండి గంగమ్మ ఆలయం వరకు, అటువైపు తాతయ్యగుంటకట్ట మార్గం, ఇటువైపు మార్కెట్ తూర్పుగేట్ నుండి తుడ కార్యాలయం రోడ్డుపైకి చేరుకునే మార్గం, తుడ కార్యాలయం కూడలి నుండి గంగమ్మ ఆలయానికి చేరుకునే మార్గం, పెద్దకాపులేఔట్ ఎక్స్‌టెన్సన్ రోడ్డునుండి తాతానగర్ కూడలి ప్రాంతాల్లో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించారు. బారీ ఇనుపకేడ్లను ఏర్పాటుచేసి దారులన్నీ మూసేశారు. ఈ వాతావరణం సహజంగా గంగమ్మ జాతరలో చివరి మూడురోజులు ఆదివారం, సోమవారం, మంగళవారం అర్ధరాత్రి వరకు తిరుపతిలో కనిపిస్తుంది, అదీ కూడా భక్తుల రద్దీని నియంత్రించేందుకు,మహిళా భక్తులు పొంగళ్ళు పెట్టేందుకు పెద్దసంఖ్యలో తరలి రావడం జరుగుతుంది. దీంతోనే ఎటువంటి తోపులాటలు, ఇబ్బందులు లేకుండా చూడటంలో ఆ మూడురోజులు పోలీసులు కీలకంగా పనిచేస్తారు. అయితే ఈ ఏడాది జాతరకు మొదటినుండే గంగమ్మ ఆలయం అష్టదిగ్భందనంలో పెట్టేయడంతో తిరుపతి జనం అవస్థలు పడుతున్నారు. గంగమ్మ ఆలయ ఛైర్మన్, ఈఓ, అనుభవజ్ఞులైన పోలీసు అధికారులు మరోసారి ఈ అష్టదిగ్భంధనంపై పునరాలోచన చేస్తే తిరుపతిజనం హర్షిస్తారు.

## ట్రాక్టర్‌ను ఢీకొట్టిన ఐచర్ వ్యాన్

### ఐదుగురికి గాయాలు, ఇద్దరి పరిస్థితి విషమం



చంద్రగిరి, మే 6 ప్రభాతవార్త: ముంగిలిపట్టు సమీపంలో బుధవారం వేకువ జామున రోడ్డు జరిగింది. పూతలపట్టు - నాయుడుపేట జాతీయ రహదారి ముంగిళిపట్టు బ్రిడ్జి సమీపంలో ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక వస్తున్న ఐచర్ వ్యాన్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న 9 మంది కూలీలలో 5 మందికి గాయాలయ్యాయి. దామలచెరువు నుండి తిరుపతికి మామిడికాయలు కోసేందుకు 9 మంది కూలీలతో వెళుతున్న ట్రాక్టర్ బెంగుళూరు నుండి భువనేశ్వర్ వెళుతున్న ఐచర్ వ్యాన్ వెనుక నుండి వేగంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ట్రాక్టర్‌లో ప్రయాణిస్తున్న దామలచెరువు గ్రామస్థులు గిరి, శోభ, గోపి, మంజు, చంద్రశేఖర్ గాయాలపాలయ్యారు. వీరిలో ఇద్దరి పరిస్థితి కొంత విషమంగా వున్నట్లు తెలిసింది. ఎస్ఐ ప్రవళ్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

చిట్వేలి, మే 6 ప్రభాతవార్త:



ఈదురు గాలులతో కూడిన వర్షంతో తీవ్రంగా నష్టపోయిన అరటి, నువ్వులు, మొక్కజొన్న పంటల రైతులను ప్రభుత్వం తరఫున ఆదుకుంటామని శాసనసభ్యులు అరవ శ్రీధర్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని చిల్లవాండ్లపల్లి గ్రామంలో అధికారులు, టిడిపి యువ నాయకులు ముక్కా సాయి వికాస్ రెడ్డి తో కలిసి దెబ్బతిన్న అరటిపంటను పరిశీలించారు. 8 ఎకరాలలో కోత దశలో ఉన్న అరటి నేలమట్టమై కన్నీటి పర్యంతమైన రైతు సానేపల్లి రామచంద్రయ్యను పరామర్శించారు. ప్రభుత్వం తరఫున పరిహారం పొందేందుకు పూర్తిస్థాయిలో తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. మండల వ్యాప్తంగా రైతులకు ఏ ఏ పంటలకు ఎంత మేర నష్టం జరిగిందన్న సమగ్ర సమాచారాన్ని తనకు అందివ్వాలని వ్యవసాయ సిబ్బందికి సూచించారు. కాగా రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వానికి నివేదించవలసిన బాధ్యత ఉద్యాన శాఖాధికారి ఎమ్మెల్యే పర్యటనలో లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఆర్ బి కే సిబ్బంది అధికారికి ముందస్తు సమాచారం ఇచ్చినప్పటికీ నిర్లక్ష్యంగా ప్రవర్తించడంతో ఎమ్మెల్యే సంబంధిత అధికారిపై జిల్లా ఉద్యాన అధికారికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం. రైతులకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహక సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవడంలోనూ, మామిడి రైతులకు చేకూరుస్తున్న పండ్ల కవర్లు, పండు ఈగ బుట్టలను అందించడంలో మండల ఉద్యాన అధికారి ప్రవర్తించిన నిర్లక్ష్య తీరుపై రైతులు ఎమ్మెల్యేకు పెద్ద ఎత్తున ఫిర్యాదు అందించారు. వ్యవసాయ అధికారి సుధాకర్, ఆర్ బి కే సిబ్బంది కళ్యాణ్,ఒబయ్య,శివ,కళ్యాణ్, వీఆర్వో భుజంగరావు,జనసేన నాయకులు మాదాసు నరసింహ, మాజీ ఎంపీటీసీ ఉప్పలపాటి శివప్రసాద్ రాజు, మద్దూరి మన్మథ, గొబ్బిళ్ళ చంగల్ రాయుడు, బొంతల నాగేశ్వరరావు, పెద్దంగారి సాయి మాదినేని రాజా, పవన్ రాజు, తోట శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## యోగివేమన యూనివర్సిటీ ఫలితాలలో

### శ్రీ సాయి డిగ్రీ కాలేజి రికార్డు విజయాలు: ప్రిన్సిపల్

రైల్వేకోడూరు రూరల్, మే 6 ప్రభాతవార్త



రైల్వే కోడూరు పట్టణంలోని శ్రీ సాయి డిగ్రీ కళాశాలలో యోగివేమన యూని వర్సిటీ ఫలితాలలో విజయాలు సాధిం చారని కళాశాల ప్రిన్సిపాల్ ముత్యాల పెంచలయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగివేమన యూనివర్సిటీ ప్రకటించిన డిగ్రీ మొదటి సంవత్సరం సెమిస్టర్ లో కళాశాల విద్యార్థులు విశిష్ట ఫలితాలను సాధిం చిందని తెలిపారు. ఇందులో బీకాంప్ ఇందులో బీకాం కంప్యూటర్స్, బిఎస్సి కంప్యూటర్ సైన్స్ విభాగాల్లో విద్యార్థులు అత్యుత్తమ మార్కులను సాధించారని పెంచలయ్య తెలియజేశారు. టి. తులసి 10/10 జిపిఏ( బీకాం కంప్యూటర్స్), ఆర్ ధన్య సాయి 10/10 జిపిఏ, షేక్ దిల్షా 10/10 జిపిఏ, షేక్ కుష్బూ 10/10 జిపిఏ, ఎస్.కీర్తన 10/10 జీపీఏ, ఇందులో తల్లిదండ్రుల సహకారం మా కళాశాల అధ్యాపకుల అంకితభావం, విద్యార్థుల శ్రమ కలిసి ఈ విజయానికి దోహద పడిందని తెలిపారు. అనంతరం ఈ విజయం సాధించిన విద్యార్థులను ఘనంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ పి శ్రీనివాసులు, ఎస్. ఎన్. శ్రీనివాసులు, కంచిరాజు చెంగల్ రాజు, ఉత్తరాది వెంకటేశ్వర్లు, శ్రీ సాయి డిగ్రీ కళాశాల యాజమాన్యం పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారం వేదికలో

### వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్: తాసిల్దార్

ఓబులవారిపల్లి, మే 6 ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టర్ మరియు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో భాగంగా. గురువారం ఓబులవారిపల్లి మండలంలోని పెద్దవరం పాడు పంచాయతీ గ్రామంలో. వన్ మంత్ వన్ విలేజ్ ఫోర్ విజిట్స్ అనే కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టారని ఓబులవారిపల్లి తాసిల్దార్ యామిని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి నెలలో నాలుగు పంచాయతీలలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఏర్పాటు చేయడం జరుగుతుందని ఈ కార్యక్రమం ద్వారా ఆ పంచాయతీలో ఉన్న ప్రజా సమస్యలు ఏవైనా అన్ని శాఖల పరంగా పరిష్కార మార్గాలు చూపుతామన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అధికారులుగా తాసిల్దార్ మరియు ఎంపీడీవో పంచాయతీ రాజ్ ఏ ఈ మరియు ఇరిగేషన్ అధికారులు అన్ని శాఖల అధికారులు పాల్గొని ప్రజా సమస్యలు వినతులను స్వీకరించి సమస్యలు పరిష్కారం మార్గాలు చూపాలని ఆమె కోరారు.

## భూ సమస్యలు తీర్చేందుకు ప్రత్యేక సందర్శనలు

చిట్వేలి, మే 6, ప్రభాతవార్త:



గ్రామాలలో నెలకొన్న భూ సమస్యలను తీర్చేందుకు ప్రభుత్వం "ఒక నెల ఒక గ్రామం నాలుగు సందర్శనలు" కార్యక్రమం తీసుకొచ్చిందని స్థానిక ఎమ్మార్వో శిరీష బుధవారం పత్రికా ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా 7వ తేదీ అనగా గురువారం మధ్యాహ్నం 2:00 గంటలకు రాజుకుంట పంచాయతీలో మొదటి సందర్శన ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఏడు రోజులు వ్యవధితో 14న రెండవ సందర్శన ,21న మూడవ సందర్శన , 28వ నాలుగో సందర్శన నిర్వహించినట్లు తెలిపారు. మొదటి సందర్శనలో గ్రామంలో అప్పగించబడిన భూములు, 22తి నిషేధిత ఆస్తులు, చెరువులు/నీటి వనరులు మొదలైన వివరాల పఠనం, ప్రభుత్వ భూముల పరిశీలన, గ్రామ ప్రజల నుండి వినతిపత్రాల స్వీకరణ, సరళమైన సమస్యల పరిష్కారం, పిటిషన్లను పి జి ఆర్ ఎస్ లో నమోదు ఉంటుందన్నారు.రెండవ సందర్శనలో సమర్పించిన వినతులపై స్థల పరిశీలన, రికార్డుల పరిశీలన, విచారణలు నిర్వహణ, అభ్యర్థులకు పురోగతి సమాచారం అందజేయడం జరుగుతుందన్నారు.మూడవ సందర్శనలో పెండింగ్ వినతుల పరిష్కారం, అవసరమైన ఉత్తర్వులు (మ్యూటేషన్/ఆర్.ఓ.ఆర్ సవరణలు) జారీ చేయడం, నాలుగవ సందర్శనలో గ్రామ సభ నిర్వహించి పరిష్కరించిన వినతుల వివరాలు వెల్లడించడం, పూర్తి నివేదిక ప్రదర్శన, పౌరుల అభిప్రాయాల స్వీకరణ చేపట్టడం జరుగుతుందని,కనుక సంబంధిత గ్రామంలో ఉన్న రెవెన్యూ సమస్యలపై (భూమి వివాదాలు, ఆర్.ఓ.ఆర్ సవరణలు, వెబ్ల్యాండ్ సమస్యలు, సరిహద్దు వివాదాలు, దారి సమస్యలు తదితరాలు) వినతిపత్రాలు సమర్పించాలని తాసిల్దార్ శిరీష పత్రికా ముఖంగా తెలియపరిచారు.

## టి.టి.డి జూనియర్ కళాశాలల్లో ప్రవేశాల ప్రక్రియ ప్రారంభం

### ఆన్‌లైన్‌లోనే దరఖాస్తులు – జూన్ 3 చివరి తేదీ

**తిరుపతి విద్య మే 6 ప్రభాతవార్త** శ్రీ వేంకటేశ్వర స్వామి కృపతో తిరుమల తిరుపతి దేవస్థానములు (టి.టి.డి) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతి మహిళా జూనియర్ కళాశాల మరియు శ్రీ వేంకటేశ్వర జూనియర్ కళాశాలల్లో 2026–2027 విద్యా సంవత్సరానికి ప్రవేశాల ప్రక్రియ ప్రారంభమైంది.అర్హత గల విద్యార్థులు మే 6, 2026 నుండి జూన్ 3, 2026 వరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులను సమర్పించవచ్చని విద్యాశాఖ అధికారులు తెలిపారు. దరఖాస్తులు పూర్తిగా ఆన్‌లైన్‌లోనే స్వీకరించబడతాయని, కళాశాలలకు హార్డ్ కాపీలు సమర్పించాల్సిన అవసరం లేదని స్పష్టం చేశారు.విద్యార్థుల సౌకర్యార్థం ఆన్‌లైన్ దరఖాస్తు ఫారం ఆంగ్ల భాషలో అందుబాటులో ఉన్నప్పటికీ, స్టూడెంట్ యూజర్ మాన్యువల్ మరియు కళాశాలల ప్రాస్పెక్టస్‌లు తెలుగు, ఆంగ్ల భాషల్లో అందించబడినట్లు తెలిపారు.నిర్దేశిత గడువులోగా దరఖాస్తులు సమర్పించాలని, చివరి తేదీ జూన్ 3 అని అధికారులు పేర్కొన్నారు.టి.టి.డి విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్య, క్రమశిక్షణతో పాటు విలువలతో కూడిన బోధన అందుతుందని, విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని దేవస్థానాల విద్యాశాఖాధికారి సూచించారు.

## ఎన్ సీసీ శిక్షణా శిబిరం ప్రారంభం

తిరుపతి విద్య, మే 6 ప్రభాత వార్త



ఎస్వీయూ సమీపంలోని ఎన్ సీ సీ నగర్ శిక్షణా కేంద్రంలో కంబైన్డ్ యాన్యువల్ ట్రెనింగ్ క్యాంప్ 1 బుధవారం నుంచి ప్రారంభమైందని ఎన్ సీ సీ 11 ఆంధ్ర ఏ స్కాడ్ గ్రూప్ కెప్టెన్ ఆర్జే ఆత్రే తెలిపారు. బుధవారం ఆయన శిక్షణా శిబిరం గురించి మాట్లాడుతూ పది రోజుల పాటు జరగనున్న శిక్షణా శిబిరం ఈనెల 14వ తేదీ వరకు కొనసాగుతుందని, ఈ శిబిరంలో రాష్ట్రంలోని వివిధ కళాశాలలు, పాఠశాలలకు చెందిన 565 మంది ఎన్ సీ సీ క్యాడెట్లు పాల్గొని శిక్షణ పొందనునట్లు చెప్పారు. క్యాడెట్లకు క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలు, ఐకమత్య భావన, సమాజిక సేవ వంటి అంశాలపై సుదీర్ఘ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. శిక్షణను సమర్థవంతంగా నిర్వహించేందుకు క్యాడెట్లను ప్రతాప్, అర్జున్, సుబ్రోటో అనే మూడు బృందాలుగా విభజించామని, శిబిరంలో భాగంగా క్యాడెట్లకు డ్రిల్, ఫైరింగ్, అబ్బాకిల్ కోర్స్, మ్యాప్ రీడింగ్, ఫీల్డ్ క్రాఫ్ట్, బ్యాటిల్ క్రాఫ్ట్ వంటి మిలిటరీ శిక్షణతో పాటు డిబేట్, క్విజ్, క్రీడా పోటీలు, గ్రూప్ టాస్క్ లో , యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. క్యాడెట్లలో పోటీతత్వాన్ని పెంపొందించేందుకు వివిధ విభాగాల్లో పోటీలు నిర్వహించి బెస్ట్ క్యాడెట్ అవార్డుతో సత్కరించి, జాతీయ స్థాయిలో జరిగే క్యాంపులకు ఎంపిక చేస్తామని చెప్పారు.

## రేపు ఎస్వీయూలో జాబ్ మేళా

తిరుపతి విద్య మే 6 ప్రభాత వార్త

ఎస్వీయూ ఎంప్లాయిమెంట్ కార్యాలయంలో శుక్రవారం జాబ్ మేళా నిర్వహించనున్నట్లు కార్యాలయ అధికారి టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. పేరొందిన ఎమ్ఎన్సీ కంపెనీల ప్రతినిధులు జాబ్ మేళాకు హాజరై సుమారు 1800కు పైగా పలు రకాల ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని తెలియజేశారు. ఎస్ఎస్ఎస్సీ, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, బీటెక్, పీజీ, డిప్లొమో అర్హతగల అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆసక్తిగల అభ్యర్థులు మరిన్ని వివరాల కోసం వర్సిటీలోని ఎంప్లాయిమెంట్ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## రాయితీతో వ్యవసాయ పనిముట్లు సద్వినియోగం చేసుకోండి

పాలసముద్రం, మే 6 ప్రభాతవార్త :



మండలంలోని రైతులు అందరూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రైతులకు అందిస్తున్న రాయితీ వ్యవసాయ పనిముట్లను కొనుక్కుని మరింత మెరుగైన వ్యవసాయం చేయాలని స్థానిక వ్యవసాయ అధికారి ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి మాట్లాడుతూ మండలంలోని రైతులు వారికి అవసరమైన వ్యవసాయ పనిముట్లను ఆన్లైన్ ద్వారా పొందుపరచుకొని జిల్లా సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే లాటరీ పద్ధతిలో రైతులకు పనిముట్లు అందిస్తారని తెలిపారు. ఐదు ఎకరాల లోపు ఉన్న ఎస్సీ ఎస్టీ మహిళలకు 50 శాతం రైతుతో పనిముట్లు ఇస్తారని మరియు బిసి ఓసి లకు 40 శాతం సబ్సిడీతో పనిముట్లు అందిస్తారని తెలిపారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న పనిముట్ల వివరాలు కల్టివేటర్ బ్లేడు, స్ప్రేయర్ లు, పవర్ టిల్లర్, లీడర్ రేపర్ అనే పరికరాలు అందుబాటులో ఉన్నాయి కావలసిన రైతులు / అనే ఆన్లైన్ వెబ్ సైట్ ద్వారా ఠిలీరీ సిబ్బంది ద్వారా అప్లై చేసుకోవచ్చని తెలిపారు.

## విద్యార్థులను అభినందించిన 'చెరుకూరి' వసంత్‌కుమార్

చిత్తూరురూరల్, మే 6 ప్రభాతవార్త :



ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు పదవ తరగతి ఫలితాల్లో ప్రైవేట్ పాఠశాల విద్యార్థులకు దీటుగా మార్కులు సాధించడం ఎంతో హర్షదాయకమని, పేద విద్యార్థుల భవిష్య త్తు పట్ల విజనరీ ముందుచూపు వున్న నాయకులు విద్యాశాఖా మంత్రి వర్యులు నారా లోకేష్ అని తెలుగుదేశం పార్టీ సీనియరు నాయకులు చెరుకూరి వసంత్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం, స్థానిక వరదప్పనాయుడు మున్సిపల్ కార్పొరేషన్ పాఠశాలలో 500కు పైగా మార్కులు సాధించిన విద్యార్థిని, విద్యార్థులను అభినందిస్తూ వారికి మెమెంటో, స్వీట్స్ పంచి నగదు బహుమతి ప్రదానం చేసి, ఎటువంటి సహాయసహకారాలు కావాలన్న ఎల్లవేళలా అందుబాటులో వుంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజు, ఎంజి రామభద్ర, కరుణాకర్‌సిద్దు, రాజా బాలాజీ అబ్దుల్, జాప్,చిన్నరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## కాపు బలిజ జేపీసీ అధ్యక్షుడిగా వేణుగోపాల్ రాయల్

కుప్పం, మే 6 ప్రభాతవార్త



కుప్పం నియోజకవర్గ కాపు బలిజ జేపీసీ అధ్యక్షుడిగా పట్టా వేణుగోపాల్ రాయల్ ని నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అమ్మ శ్రీనివాస్ నాయుడు నియామక పత్రం జారీ చేశారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గ కాపు, బలిజల సంక్షేమానికి శక్తివంతన లేకుండా కృషి చేస్తానని పేర్కొన్నారు.

## నేడు వర్ష సూచన

చిత్తూరుహెల్త్, మే 6 ప్రభాతవార్త:

కర్నాటక నుండి రాయలసీమ, తమిళనాడు మీదుగా మన్నార్ గల్ఫ్ వరకు ద్రోణి విస్తరించి వుండటంతో జిల్లాలో గురువారం వర్షాలు కురిసే అవకాశం వుందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఓ ప్రకటనలో పేర్కొంది. ఈ ద్రోణి ప్రభావంతో శ్రీసత్యసాయి, వైఎస్ఆర్ కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ పిడుగులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం వుంది. బుధవారం తిరుపతి జిల్లా వెంకటగిరిలో అత్యధికంగా 41.2 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది.

## కాణిపాకంలో నూతన భవనంలోకి పోలీస్ స్టేషన్ మార్పు

కాణిపాకం, మే 6 ప్రభాతవార్త:



కాణిపాకంలో ప్రస్తుతం వున్న పోలీస్ స్టేషన్‌ను బుధవారం బస్‌స్టాండ్ సమీపంలోని నూతన భవనంలోకి మార్పు చేశారు. ప్రస్తుతం ఆలయ పుష్కరిణి వద్ద పోలీస్ స్టేషన్ నడుస్తోంది. ఆలయ అభివృద్ధిలో భాగంగా ఆలయ పుష్కరిణిని సుమారు రూ.3 కోట్లతో విస్తరించనున్నారు. ఈ మేరకు పోలీస్ స్టేషన్ భవనంను అక్కడి నుండి తొలగించనుండటంతో ప్రత్యామ్నాయంగా బస్టాండ్ సమీపంలోని దేవస్థానంకు చెందిన నూతన భవనంలోకి మార్పు చేయడానికి పోలీసు ఉన్నత అధికారులు చర్యలు చేపట్టారు. ఈ మేరకు నూతన భవనంలో పూజ నిర్వహించి పోలీస్ స్టేషన్‌ను మార్పు చేశారు. దేవస్థానం ఛైర్మన్ మణినాయుడు, చిత్తూరు రూరల్ ఇన్స్‌పెక్టర్ శ్రీధర్‌నాయుడు, కాణిపాకం ఎస్ఐ నరసింహులు, ఆలయ ఏఇఓ ధనంజయ, పాలకమండలి సభ్యులు శివప్రసాద్, ఇంజనీరింగ్ శాఖ జెఇలు, పోలీస్ స్టేషన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మామిడి రైతులను ఆదుకోవాలి

### -సిపిఐ నాయకులు డిమాండ్

తవణంపల్లి, మే 6 ప్రభాతవార్త:



ఇటీవల కురిసిన అకాల వర్షాల వల్ల వీచిన పెనుగాలులతో మామిడి పంట నేల రాలి తీవ్రంగా నష్టపోయిన మామిడి రైతులను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని జిల్లా సిపిఐ నాయకులు నాయకులు డిమాండ్ ఏచశారు. ఈ మేరకు సిపిఐ జిల్లా కార్యదర్శి నాగరాజు, ప్రధాన కార్యదర్శి శివారెడ్డి, ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి మునిరత్నంనాయుడు తదితరులు మండలంలోని అరగొండకు చెందిన వేణుగోపాల్‌నాయుడు మామిడి తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా పెనుగాలులకు దెబ్బతిన్న పంటను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ జిల్లాలోని పలు మండలాల్లో అకాల వర్షాలతో వందలాది ఎకరాల్లో మామిడి పంట నేల రాలి మామిడి రైతుకు తీవ్ర నష్టం కల్గించినట్లు తెలిపారు. నేల రాలిన మామిడి కాయలకు ప్రభుత్వం మద్దతు ధర కల్పించి ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, విహెచ్‌విఎస్ నాయకులు గజేంద్రబాబు, మామిడి రైతులు వేణుగోపాల్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## వైద్య శిబిరంను ప్రారంభించిన ఎంపిపి

గుడిపాల, మే 6 ప్రభాతవార్త:



మండల పరిధిలోని పల్లూరు గ్రామంలో బుధవారం ఎంపిపి గొల్ల హరిప్రసాద్ చౌదరి ఆశాదీప్ చారిటబుల్ ట్రస్ట్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంను ప్రారం భించారు. ఈ సందర్భం గా ఎంపిపి మాట్లాడు తూ సామాన్య ప్రజల కోసం ఆశాదీప్ ట్రస్ట్ హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేయడం స్ఫూర్తిదాయకమన్నారు. ఈ వైద్య శిబిరం బడుగు బలహీన వర్గాలు, వృద్ధులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. వైద్య శిబిరంను గ్రామంలో ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ శిబిరంలో ఎంపిపి గొల్ల హరిప్రసాద్ చౌదరి వైద్య పరీక్షలు చేయించుకున్నారు.

## పబ్లిక్ హెల్త్ కార్మికురాలి మృతికి నివాళి

చిత్తూరుహెల్త్, మే 6 ప్రభాతవార్త:

మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పారిశుధ్య విభాగంలో పబ్లిక్ హెల్త్ కార్మికురాలిగా విధులు నిర్వహిస్తున్న అమ్మరాణి మృతికి మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ లోకేష్‌లు నివాళులు అర్పించారు. 19వ డివిజన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అమ్మరాణి అనారోగ్యంతో మృతి చెందడంతో ఆమె నివాసం వుంటున్న చామంతిపురం మున్సిపల్ క్వాటర్స్‌లో మృతదేహంను వుంచారు. అక్కడికి వెళ్లిన కమీషనర్, ఎంహెచ్‌ఒ అమ్మరాణి మృతదేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం కమీషనర్, ఎంహెచ్‌ఓలు అమ్మరాణి కుటుంబసభ్యులను పరామర్శించి మట్టి ఖర్చుల కోసం రూ.15 వేలు అందజేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వం తరపున అన్ని విధాలా ఆదుకుంటామని అమ్మరాణి కుటుంబసభ్యులకు మున్సిపల్ కమీషనర్ హామీ ఇచ్చారు.

## బాల వెంకన్న ఆలయాన్ని పునరుద్ధరించండి

చిన్నగొట్టిగల్లు, మే 6 ప్రభాతవార్త :



చిన్న గొట్టిగల్లు మండలం చెట్టేవారిపాలెం పంచాయతీ లో ఉన్న పురాతన బాల వెంకటేశ్వర స్వామి ఆలయ పునరుద్ధరణకు చర్యలు తీసుకోవాలని టీటీడీ ఈవో రవిచంద్రకు పాలక మండలి సభ్యులు భాను ప్రకాష్ రెడ్డి ద్వారా మండల బిజెపి అధ్యక్షుడు కిషోర్ కుమార్ వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఆలయాన్ని చోలాళకాలంలో నిర్మించారని, అందులో వివిధ రకాల మండపాలు ధ్వజస్తంభం కూర్మసిలాజాలు నాగశిలా ప్రతిమలు యజ్ఞశాల గోశాల మొదలైన వాటి గురించి వివరించారు. ఆలయానికి ఉన్న భూములు గురించి తెలియజేశారు. దీప దూప నైవేద్యాలకు నోచుకోకపోవడంతో శిథిలావస్థకు చేరిందని దాని పునరుద్ధరణకు చర్యలు చేపట్టాలని కోరగా ఈవో సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జీవన్ రాయల్, వెంకటేష్, రామకృష్ణ, గురువారెడ్డి, చంగల్ రాయలు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు పలమనేరు, కుప్పం,

## విద్యుత్ బకాయిల వసూళ్లకు వన్‌టైం సెటిల్‌మెంట్

### – రెస్కోఛైర్మన్ ప్రతాప్‌కుమార్ – 48.79కోట్ల దాకా గృహ విద్యుత్ బకాయిలు.. 45755 మంది డిఫాల్టర్లు !!

కుప్పం, మే 6 ప్రభాతవార్త



కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) పరిధిలో విద్యుత్ బకాయిల వసూళ్లకు సిఎం చంద్రబాబునాయుడు ఆదే శాలతో వన్‌టెం సెటిల్‌మెంట్ (ఓటిఎస్) పథకంను తీసుకు వచ్చినట్లు రెస్కో ఛైర్మన్ విజి ప్రతాప్‌కుమార్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక రెస్కో కేంద్ర కార్యాలయంలో రెస్కో ఎండి సోమశేఖర్, రెస్కో డైరెక్టర్లతో కలసి ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వన్‌టైం సెటిల్‌మెంట్ పథకం మే 6–20తేదీల వరకు అమలు చేస్తామన్నారు. గృహ విద్యుత్ బకాయిలు రూ 1001–2000దాకా ఉంటే 10శాతం రాయితీ ఇస్తామన్నారు. అలాగే రూ 2001నుంచి 3వేల దాకా ఉంటే 15శాతం, రూ 3001కుపైబడిన బకాయిలకు 20శాతం రాయితీ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈనెల 20వతేది లోగా పూర్తిగా బకాయిలు చెల్లించేవారికి ఈ పథకం వర్తిస్తుందన్నారు. రెస్కో పరిధిలో గృహాలకు సంబంధించి రూ 48.79కోట్ల మేర బకాయిలు ఉన్నాయన్నారు. 45755మందిని డిఫాల్టర్లుగా గుర్తించినట్లు తెలిపారు. ఈ వన్‌టైం సెటిలె మ్మంట్ పథకాన్ని గృహ విద్యుత్ బకాయిలున్న వినియోగదారులు సద్వినియోగం చేసుకుని బిల్లులు చెల్లించి సంస్థ అభివృద్ధికి సహకరించాలని కోరారు. సమావేశంలో రెస్కో డైరెక్టర్లు శివతేవర్, తులసినాథ్, అమీర్, అనసూయ, హరోగరన్, బాలగంగాధర్, మునివెంకటప్ప పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపండి: ఎంపీపీ

వి.కోట, మే 6 ప్రభాతవార్త



మండల పరిధిలోని గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి ప్రత్యేక అధికారులు శ్రద్ధ చూపాలని ఎంపిపి యువరాజ్ పెర్కొన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ యువరాజ్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ముఖ్యఅతిథిగా విచ్చేశారు.మండలంలోని వివిధ శాఖల అధికారులు సమావేశంలో ప్రభుత్వపరంగా అమలు జరుగుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల వివరాలను సమావేశంలో వివరించారు.ఈ సందర్భంగా యువరాజ్ మాట్లాడుతూ మండల పరిధిలోని ఎస్ బండపల్లి పంచాయతీ బెల్లకుంట గ్రామంలో త్రాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సోలార్ ప్లాంట్ల కోసం పేద రైతుల భూములను బలవంతంగా తీసుకోవద్దని రెవెన్యూ అధికారులకు సూచించారు. రైతులు స్వచ్ఛందంగా భూములను ఇచ్చేందుకు ముందుకు వస్తే వాటిని తీసుకోవాలని కోరారు.రీ సర్వేలో నెలకొన్న భూ సమస్యలను సత్వరం పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. రాబోవు వర్షాకాలం దృష్టిలో ఉంచుకొని విద్యుత్ శాఖ అధికారులు లూజ్ లైన్ లను సరిచేయాలని,పాడైన విద్యుత్ స్తంభాలను మార్చి నూతనంగా ఆమార్చాలని సూచించారు.ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణం లో ప్రయాణికుల సౌకర్యానికి సరైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సమావేశం ప్రారంభమైన వెంటనే ఇటీవల హత్యకు గురైన రిపోర్టర్ జగన్మోహన్ రెడ్డి మృతికి సమావేశంలో సభ్యులు, అధికారులు సంతాపాన్ని ప్రకటించారు. వైస్ ఎంపీపీలు, ఎంపీడీవో వెంకటేశ్వరరావు,ఎమ్మార్వో ఉదయ్ సంతోష్ తో పాటు వివిధ శాఖల అధికారులు,పంచాయతీ కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## అక్రమ కేసులపై న్యాయం గెలిచింది

### మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు

రామకుప్పం, మే 6 ప్రభాతవార్త



గత వైసీపీ ప్రభుత్వంలో అక్రమ కేసులు పెట్టి వేధ్నిచార ని, చివరికి న్యాయం గెలిచిందంటూ మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, సీఎం చంద్రబాబు పిఏ మనోహర్ పేర్కొన్నారు. బుధవారం చిత్తూరు కోర్టుకు టిడిపి నేతలు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో మాజీ, ప్రస్తుత ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు 2022 జూన్ 22న కుప్పం పర్యటన భాగంగా మండలంలోని గొల్లపల్లి గ్రామం వద్ద వైసిపి నేతలు, కార్యకర్తలు పర్యటనను అడ్డుకున్నారు. దీంతో వైసిపి, టీడీపీ పరస్పర దూషణలతో స్వల్ప ఉద్రిక్తతకు దారి తీసింది. వైసిపి పార్టీ రాజకీయ కక్షాలతో అక్రమ కేసులు బనాయించారు. అప్పటినుంచి చిత్తూరు కోర్టుకు హాజరై సాక్షాలు లేనందున బుధవారం చిత్తూరు కోర్టు జడ్జి కేసు కొట్టివేశారు. వైసిపి పార్టీ రాజకీయం, రాజకీయాలతోనే ఎదుకోవాలే తప్ప తప్పుడు కేసులు పెట్టి టిడిపి పార్టీని భయపెట్టలేరని ఘాటుగా విమర్శించారు. తమ అధినేత చంద్రబాబు నాయుడు నీచ రాజకీయాలను తమకు నేర్పలేదని తెలిపారు. పార్టీలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు అమలు చేస్తున్నది కూటమి ప్రభుత్వమేనని తెలిపారు శాంతిపురం మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు ఉదయ్ కుమార్, విశ్వనాథ్, కడ సభ్యుడు రాజ్ కుమార్, ఎస్సీ ఎస్టీ మానిటరింగ్ సభ్యుడుజయశంకర్, కో యూనిట్ ఇంచార్జ్ శంకరాచలం, రెస్కో సభ్యుడు విజయ్ కుమార్, మణీ, బాలు పాల్గొన్నారు.

## రాయితీతో జొన్న..మొక్కజొన్న విత్తనాలు పంపిణీ

కుప్పం, మే 6 ప్రభాతవార్త



మండలంలోని మల్లానూరులో ప్రభుత్వం తరపున రైతులకు రాయితీతో జొన్న, మొక్కజొన్న విత్తనాలను బుధవారం టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్, జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కడ సభ్యుడు రామచంద్ర, కార్పొరేషన్ డైరెక్టర్లు మణి, శరవణ పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం చంద్రబాబునాయుడు రైతుల పక్షపాతి అన్నారు. కూటమి ప్రభుత్వంలో రైతులకు అన్ని విధాలా అండగా నిలవడం జరుగుతోందన్నారు. రైతులు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెటర్నరీ ఎడి రవిశంకర్, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజు, నేతలు విభూషణ్, దాము, రమేష్, తులసి, కళై, రాజ్‌కుమార్, రాజా, ప్రకాష్ పాల్గొన్నారు.

## పేదల ఆరోగ్యంకు రక్ష సంజీవని ప్రాజెక్టు

### – టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్

కుప్పం, మే 6 ప్రభాతవార్త



సిఎం చంద్రబాబునాయుడు కుప్పంలో అమలు చేస్తున్న సంజీవని ప్రాజెక్టు (టాటా డిఐఎన్‌సి) పేద ప్రజల ఆరోగ్యంకు రక్ష అని టిడిపి మండల అధ్యక్షుడు రాజగోపాల్ పేర్కొన్నారు. బుధవారం వెండుగంపల్లిలో జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. కుప్పంలో పైలట్ ప్రాజెక్టుగా ఈ పథకం అమలులో ఉందన్నారు. ప్రజలందరికీ వైద్య పరీక్షలు చేపట్టి వారి ఆరోగ్య వివరాలు డిజిటల్‌రూపంలో భద్రపరచడం జరుగుతుందన్నారు. అత్యవసర వేళల్లో ఎవరికైనా వైద్యం అవసరం అయితే నిపుణులైన వైద్యులచే వైద్య సేవలు అందిస్తారన్నారు. అన్ని పిహెచ్‌సి కేంద్రాల్లోను ఈ ప్రాజెక్టు అమలులో ఉందన్నారు. ప్రజలు తప్పక సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి సాంబశివం, కార్పొరేషన్ డైరెక్టర్ చెక్కునత్తం మణి, తెలుగుయువత అధ్యక్షుడు కనకరాజ్, నేతలు రమేష్, అశోక్, రామచంద్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కారం

శాంతిపురం, మే 6 ప్రభాతవార్త



మండలంలోని అబకలదొడ్డి, తుమ్మిశి గ్రామాల్లో మంచినీటి సమస్యను నూతన బోరు మోటార్లు ఏర్పాటుచేసి పరిష్కరించినట్లు ఎంపిడిఓ ఎపిఆర్ కుమార్ తెలిపారు. ప్రజలు నీటి సమస్యను తమ దృష్టికి తేగా వెంటనే పరిష్క రించా మన్నారు. సుమారు ఐదు గ్రామాల ప్రజలకు నీటి సమస్య తీరిందన్నారు. మండ లంలో ఎక్కడైనా నీటి సమస్య ఉంటే ప్రజలు స్థానిక కార్యదర్శులను సంప్రదించాలన్నారు. ఎవరైనా స్పందించకుంటే తన దృష్టికి తేవాలని కోరారు.

## బ్యాంకులు..ఏటిఎంలను తనిఖీ చేసిన ఎస్సై

శాంతిపురం, మే 6 ప్రభాతవార్త



జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు బుధవారం రాళ్లబూదుగూరు పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న వివిధ బ్యాంకులు, ఏటిఎం కేంద్రాలను ఎస్సై నరేష్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అక్కడ ఉన్న సిసి కెమెరాల పనితీరు, రాత్రిపూట లైటింగ్ వసతి, సెక్యూరిటీ అలారమ్ వ్యవస్థ, భద్రతా సిబ్బంది విధులు తదితర అంశాలు పరిశీలించి బ్యాంకు మేనేజర్లకు పలు సూచనలు చేశారు. బ్యాంక్ పరిసర ప్రాంతాల్లో ఎవరైనా అనుమానితులు సంచరించడం చేస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. నగదు లావాదేవీల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

# తిరుపతి డివిజన్

## డిగ్రీ ఓపెన్ వర్సిటీ పరీక్షల షెడ్యూల్ విడుదల

**తిరుపతి విద్య మే 6 ప్రభాత వార్త**

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ పలు డిగ్రీ పరీక్షలకు సంబంధించి ఫీజు చెల్లింపు తేదీలు, పరీక్షల షెడ్యూల్ విడుదలైనట్లు ఎస్వీ ఆర్ట్స్ కళాశాల అంబేడ్కర్ వర్సిటీ స్టడీసెంటర్ కోఆర్డినేటర్ డాక్టర్ జి కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా డిగ్రీ ఆరవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 14 నుంచి, నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈనెల 21 నుంచి, సెకండ్ సెమిస్టర్ పరీక్షలు జూలై 6వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని తెలిపారు. పరీక్షలు హాజరుకానున్న అభ్యర్థులు ఈనెల 19వ తేదీలోపు ఫీజు చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు. అలాగే ఓపెన్ వర్సిటీ డిగ్రీ (బీఏ, బీకాం, బీఎస్సీ ఓల్డ్ ప్యాటర్న్) పరీక్షలు జూలై 10వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని మొదటి, రెండవ, మూడవ సంవత్సరం డిగ్రీ పరీక్షలకు సంబంధించి విద్యార్థులు ఈనెల 25వ తేదీ లోపు పరీక్ష ఫీజు చెల్లించాల్సి ఉంటుందని తెలియజేశారు.

## నిరుపేదలకు కంటి చూపు: మహిళలకు టైలరింగ్

**శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తిలోని రాస్ కార్యాలయంలో వివిధ సేవ కార్యక్రమాలను నిర్వహించారు. బుధవారం రాస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మునిరత్నం వర్ధంతి సందర్భంగా రాస్ అధ్యక్షులు డాక్టర్ వెంకటరత్నం,డైరెక్టర్ నాగరాజు సూచనలతో నిరుపేదలకు ఉచిత కంటి శిబిరాన్ని నిర్వహించారు.అలాగే మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణను ఏర్పాటు చేసారు. ఉచిత కంటి శిబిరాన్ని జన్ శిక్షణ్ సంస్థాన్ సారధ్యంలో మూడు నెలల పాటు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చారు. 60 మందిని మూడు బ్యాచ్‌లుగా శిక్షణ ఇచ్చి బుధవారం ధృవీకరణ పత్రాలను అందించారు. శ్రీకాళహస్తి చుట్టుపక్కల ప్రాంతాలకు చెంది శిక్షణ పొందినవారికి ధృవీకరణ పత్రాలను అందించారు. కాగా కంటి వైద్యశిబిరంలో 220 మందికి వైద్యపరీక్షలు జరిపారు.వారిలో 60 మందికి ఆపరేషన్లు అవసరమని నిర్ధయించారు. ఈ కార్యక్రమాలకు శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెటింగ్ కమిటీ రంగినేని చెంచయ్యనాయుడు ముఖ్యఅతిధిగా హాజరయ్యారు. ఆయనతో పాటు పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు జి.విజయకుమార్‌నాయుడు, కంఠా రమేష్, గోపినాద్ తదితరులు పాల్గొన్నారు.రాస్ అధికారి కరుణాకర్‌నాయుడు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రజానాయకునికి ఆత్మీయ నివాళి

**శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి రాజకీయ చరిత్రలో తిరుగులేని నాయకుడుగా వెలుగొంది ఉమ్మడి రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా వ్యవహారించిన నేత బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా తెలుగుతమ్ముళ్లు నివాళులర్పించారు. తెలుగుదేశం పార్టీ బిసి విభాగానికి చెందిన రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ యం.ఉమేష్‌రావు సారధ్యంలో పలు కార్యక్రమాలను ఏర్పాటు చేసారు. శ్రీకాళహస్తి నియోజకవర్గంను అన్ని రంగాల్లో అభివృద్ధి పథంలో నడిపిన నాయకుడు బొజ్జల గోపాలకృష్ణారెడ్డి అని చిత్రపటానికి పూజలు జరిపి, నివాళులర్పించారు.ఈ కార్యక్రమాల్లో శ్రీకాళహస్తి వ్యవసాయమార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు తంగేళ్ళపాళెం సింగిల్ విండో చైర్మెన్ బీమాల భాస్కర్ ముదిరాజ్, శ్రీకాళహస్తి మండల పార్టీ అధ్యక్షుడు కృష్ణయాదవ్, వజ్రం కిషోర్, డివినారాయణ, కోట చంద్రశేఖర్,చిల్లకూరు మణి, చాంద్‌బాషా, మురళి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## ఉన్నత లక్ష్యాలతో చదవాలి: ఉత్తమ ఫలితాలు సాధించాలి

### పల్లం విద్యార్థులకు సన్మానం

**ఏర్పేడు, మే 6 ప్రభాతవార్త**



విద్యార్థి దశ కీలమమైనదని ఈ దశలో లక్ష్యాలతో చదివి, ఉత్తమ ఫలితాలు సాధించాలని పల్లం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన సన్మాన సభలో వక్తలు సూచించారు. పల్లం పాఠశాలలో ఇటీవల విడుదలైన పబ్లిక్ పరీక్షల్లో 500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు అభినందన సభను ప్రగతి సంస్థ ఏర్పాటు చేసింది. ఈ సన్మాన సభకు ప్రధానోపాధ్యాయులు అనంద్ అధ్యక్షత వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏర్పేడుమ ండలంలో తమ పాఠశాలకు ప్రథమ స్థానం రావటం తనకు ఎంతో ఆనందం అన్నారు.ప్రగతి సంస్థ అందించిన స్టేమ్ ల్యాబ్ ద్వారా ఫలితాల్లో కీలక పాత్ర పోషించిందన్నారు. ఈ కార్యక్రమాల్లో ప్రగతి సంస్థ కోఆర్డినేటర్ చంద్రశేఖర్, శిరీషా ఉపాధ్యాయులు,సిబ్బంది వెంకటేష్ మురుగయ్య పాల్గొన్నారు.

## చైర్మెన్‌ను సత్కరించిన కామర్‌ఆఫ్ చాంబర్

**శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిని ఛాంబర్‌ఆఫ్ కామర్స్ సారధ్యంలో సత్కరించారు.బుధవారం సరస్వతి ఆడిటోరియంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కమిటి ప్రమాణ స్వీకారానికి కొట్టె సాయి ప్రసాద్ ముఖ్యఅతిధిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తి వ్యాపార కేంద్రంగా ప్రసిద్ది చెందిందన్నారు.ఓ వైపు వ్యాపారాలు మరో వైపు పుణ్యక్షేత్రం కాబట్టి ఇక్కడ వ్యాపారస్తులు జవాబుదారి తనంతో వ్యవహారించాలన్నారు. ఈ సందర్భంగా కొట్టెసాయి ప్రసాద్ నూతనంగా ఏర్పడ్డ ఛాంబర్ ఆఫ్ కామర్స్ కార్యవర్గానికి స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలను అందించారు. ఈ సందర్భంగా ఛాంబర్‌ఆ ఫ్ కామర్స్ తరఫున చైర్మెన్‌ను దుశ్శాలువతో సత్కరించారు.

## అభివృద్ధి ప్రదాతకు నివాళులు

**శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త**



శ్రీకాళహస్తి నియోజకవర్గంను దీర్ఘకాలం పరిపాలించి అభివృద్ధి ప్రదాతగా ప్రజల గుండెల్లో నిలిచిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి 4వ వర్ధంతిని బుధవారం వ్యవసాయమార్కెట్ కమిటి ఆవరణలో మార్కెటింగ్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు సారధ్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్యఅతిధులుగా జంగాల పల్లి తులసీరామ్‌రెడ్డి, బొజ్జల సురేష్‌రెడ్డిలు హాజరై నివాళులర్పించారు.ఈ సందర్భంగా చెంచయ్యనాయుడు మాట్లాడుతూ నేడు నియోజకవర్గంలో రైతులు సుభిక్షంగా ఉన్నారంటే నాడు జన్మభూమిలో చెరువులను బాగు చేయుటమే కాకుండా సోమశిల-స్వర్ణముఖి కాలువను తీసుకొచ్చారన్నారు. ఆలయాభివృద్ధికి ఆయన కృషి దేవస్థానం తరపున స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు అన్నారు.ఈ కార్యక్రమాల్లో పట్టణ పార్టీ అధ్యక్షుడు విజయకుమార్‌నాయుడు మండల పార్టీ అధ్యక్షులు అక్షింతల కృష్ణయాదవ్,తొట్టంబేడు మండల పార్టీ అధ్యక్షుడు రావిళ్ళ మునిరాజా నాయు డు,సీనియర్ నాయకులు దశరధాచ్చారి, చెలికం పాపిరెడ్డి, పేరం ధనంజయులు నాయుడు,బీమాల భాస్కర్,క్లస్టర్ ఇన్‌చార్జిలుకంఠా రమేష్, గోపి, కుంటిపూడి రవమేష్; జగదీశ్వరరెడ్డి, యూనిట్ ఇన్ చార్జిలు సుబ్రమణ్యం నాయుడు,నరసయ్య,బత్తెయ్య, దొరైరాజరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి,ఎంఎస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు చట్టాలపై అవగాహన కల్గి ఉండాలి: వక్తలు

**తొట్టంబేడు,మే 6 ప్రభాతవార్త**



మహిళలు ప్రభుత్వాలు వారికి కల్పిస్తున్న చట్టాలకు సంబంధించి అవగాహన కల్గి ఉండాలని పోలీసుల సూచనలను తెలుసుకొని ఆత్మరక్షణతో ముందుకు సాగాలని పలువురు మహిళా వక్తలు పిలుపు నిచ్చారు. శ్రీకాళహస్తికి సమీపంలోని చెన్నై-నాయుడుపేట బైపాస్‌రోడ్డు సమీపంలోని సిఎం కళ్యాణ మండపంలో టూటౌన్ పోలీసులు మహిళాసాధికారిత సమావేశాన్ని ఏర్పాటు చేసారు. టూటౌన్ సిఐ నాగరాజు సారధ్యంలో ఏర్పాటు చేసిన సమావేశానికి అధికారులు గృహిణులు అధిక సంఖ్యలో హాజరయ్యారు.ఈ సందర్భంగా శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి చెందిన డాక్టర్లు అనుషా,డాక్టర్ ముబీనా తాజ్, గిరిజన సాంఘీక సంక్షేమ గురుకులం ప్రిన్సిపల్ లలిత, కాసాగార్టెన్‌లోని ఎస్‌సి సంక్షేమం గురుకులానికి చెందిన ప్రిన్సిపల్ మాధవి లత, ఐసిడిఎస్ ఇన్‌చార్జి భాగ్యలక్ష్మిలు హాజరయ్యారు.ఈ సందర్భంగా సిఐ నాగరాజు మాట్లాడుతూ నేడు మహిళ స ంరక్షణకు ప్రభుత్వం, పోలీసు వ్యవస్థ ఎన్నో ముందు జాగ్రత్తలు తీసుకుంటుందన్నారు. ఈ కార్యక్రమాల్లో మహిళలతో పాటు పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## యుగంధర్ రెడ్డికి మంత్రి నారా లోకేష్‌చే సత్కారం

వరదయ్యపాలెం, మే 6, ప్రభాతవార్త



శ్రీసిటీలో మంత్రి నారా లోకేష్ పర్యటన సందర్భంగా చోటుచేసుకున్న ఒక ఆసక్తికరమైన సన్నివేశం ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఈ సందర్భంగా యుగంధర్ రెడ్డి మంత్రి లోకేష్‌ని శాలువాతో సత్కరించబోగా, మంత్రి లోకేష్ సున్నితంగా తిరస్కరించి రివర్స్‌లో అదే శాలువాను స్వయంగా యుగంధర్ రెడ్డికి కప్పి గౌరవించారు. గతంలో తిరుపతి ఉప ఎన్నికల సమయంలో నారా లోకేష్ తన రాజకీయ ప్రస్థానంలో కొత్త ఒరవడిని ప్రారంభించినప్పుడు, మొదటగా యుగంధర్ రెడ్డి నివాసానికే వెళ్లారు. నేడు శ్రీసిటీ వేదికగా జరిగిన ఈ శాలువాతో సత్కారం, నారా లోకేష్ తనను నమ్ముకున్న వ్యక్తులకు ఇచ్చే ప్రాధాన్యతను మరోసారి స్పష్టం చేశారు.

## వ్యవసాయ యంత్ర పరికరాల కొరకు దరఖాస్తుల ఆహ్వానం



ఏఓ మమత

**రామచంద్రాపురం, మే 6 ప్రభాతవార్త:**

వ్యవసాయ యంత్ర పరికరాల కొరకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మమత అన్నారు. బుధవారం రామచంద్రాపురంలో ఆమె విలేకరులతో మాట్లాడుతూ 2025-26 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ యాంత్రీకరణ పథకంలో భాగంగా రూ.5.87 లక్షలు మంజూరు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 19వ తేదీలోపు వ్యవసాయ పనిముట్లకు సంబంధించిన వెబ్‌సైట్‌లో రైతులు నేరుగా తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. సంబధిత కమిటీ లాటరీ పద్దతిలో లబ్దిదారులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. ఎంపికైన లబ్దిదారులకు గ్రామ, మండల వ్యవసాయ అధికారులకు ఆన్‌లైన్‌లో మంజూరు పత్రాలు అందుతాయన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## హీరో శివాజీని కలసిన కేవీబీ పురం మండలం టీడీపీ నాయకులు

**కేవీబీ పురం, మే 6 ప్రభాతవార్త:**



ప్రముఖ సినీ నటుడు హీరో శివాజీని కేవబీ పురం మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మునస్వామి యాదవ్ నేతృత్వంలో నాయకులు తిరుపతిలోని ఓ హోటల్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. సింగిల్‌విండో చైర్మన్ ప్రకాష్ నాయుడు, లోకయ్యనాయుడు, సర్పంచ్‌లు దొరబాబునాయుడు, సురేష్ చౌదరి, పాలేగర్ సంఘ కన్వీనర్ వెంకటకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

## జాబ్‌మేళాని యువత సద్వినియోగం చేసుకోవాలి : ఎమ్మెల్యే

**కేవీబీ పురం, మే 6 ప్రభాతవార్త:**



రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం సహాయ సహకారాలతో కేవీబీ పురం ఎంపీడీవో కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొని జాబ్‌మేళాను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు 20 లక్షల ఉద్యోగాల్లో భాగంగా సత్యవేడు నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు ఒకసారి జాబ్‌మేళా నిర్వహించబడుతుందని తెలియజేశారు. ఈ జాబ్‌మేళాలో సెలెక్ట్ అయిన వారికి 13500 నుంచి 25 వేల వరకు వేతన సదుపాయం కలదని తెలియజేశారు. అదే విధంగా యువతి, యువకులు సత్యవేడు నియోజకవర్గంలో ప్రతి మూడు నెలలకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జరిగే జాబ్‌మేళాలను సద్వినియోగం చేసుకుని ఉద్యోగ అవకాశాలు అందుపుచ్చుకోవాలని ఎమ్మెల్యే తెలియజేశారు. సెలెక్ట్ కాని వారికి త్వరలో నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా ప్రభుత్వ పాలటెక్నిక్ కళాశాల సత్యవేడులో స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని అందులో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పిస్తామని తెలియజేశారు. ఈ మేళాలో 12 కంపెనీలు హాజరుకావడం, ఇందులో దాదాపు 700 ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని, కావున హాజరైన యువతి, యువకులు మీకు నచ్చిన కంపెనీలో ఇంటర్వ్యూకి హాజరై ఉద్యోగం పొందాలన్నారు. కార్యక్రమంలో డీఎస్డీవో లోకనాథం, ఎంపీడీవో మాలతి, ఏవో విజయకుమార్, ఏఎంసీ చైర్మన్ ఇళంగోవన్‌రెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి లోకనాథం, తిరుపతి ప్లేస్‌మెంట్ ఆఫీసర్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఏ.గణేష్, ప్రజాప్రతినిధులు, నాయకులు, ఏపీఎస్ఎస్‌డీసీ సిబ్బంది పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనులకు శిలాఫలకాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

**కేవీబీ పురం, మే 6 ప్రభాతవార్త:**



మండలంలోని ఎంఎ రాజుల కండ్రిగ నుంచి పూడి సీకే పురం వెళ్లే కాళంగి నదిపై కాస్వయ నిర్మాణానికి బుధవారం ఉదయం స్థానిక సత్యవేడు ఎమ్మెల్యే ఆదిమూలం భూమిపూజ శిలాఫలకాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంద్రబాబునాయుడు మన ముఖ్యమంత్రితో మాట్లాడి మండలంలోని జేఎల్ పురం, జయలక్ష్మి పురం మండలంలోని పలు గ్రామాల్లో కోట్ల లక్షలాది రూపాయలతో బ్రిడ్జిలు వంతెనలు మంజూరు చేయించానని, నేడు పూడి సీకే పురం వంతెనకు కోట్లాది రూపాయలు మంజూరు చేయించారని కానీ కాజ్‌వేలో నిర్మాణానికి మాత్రం ఒక కోటి 80 లక్షలు మంజూరు చేశారని పేర్కొన్నారు. అద్భుతంగా కింద నీళ్లు పోవడంతో రోడ్డు పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆర్‌అండ్‌బీ డీఈ మధుసూదన్‌ని ఆదేశించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు విజయకుమార్ నాయుడు, శ్రీహరి యాదవ్, సంగారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఆర్‌అండ్‌బీ ఏఈఆర్‌అండ్‌బీ మేస్త్రి మురళి తదితరులు పాల్గొన్నారు

## పిచ్చాటూరు మండలాన్ని సందర్శించిన జిల్లా గ్రామ స్వర్ణ వార్డు అధికారి

**నాగలాపురం, మే 6 ప్రభాతవార్త:**



పిచ్చాటూరులో బుధవారం తిరుపతి జిల్లా స్వర్ణ గ్రామ/ స్వర్ణ వార్డు అధికారి బి.గంగాభవాని పిచ్చాటూరు మండలంలోని కీళపూడి స్వర్ణ గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ అభివృద్ధి అధికారులతో ప్రస్తుతం ప్రభుత్వం స్వర్ణ గ్రామం ద్వారా చేపడుతున్న యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే, ఈకేవైసీ, పీ4, స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది హాజరుపై సమీక్ష నిర్వహించారు. అందులో భాగంగా యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే సమయంలో కొన్ని విద్యా అర్హతలు నమోదు చేయబడని రికార్డులను అలాగే 18 నుంచి 59 సంవత్సరాల మధ్య వయసు గల వ్యక్తుల్లో మొబైల్ నంబర్లు ధృవీకరించని వారి రికార్డులను తిరిగి సర్వే నిమిత్తం పుష్ చేయడం జరిగిందన్నారు. స్వర్ణ గ్రామ స్వర్ణ వార్డు సిబ్బంది పూర్తి చేయాలని తెలియజేశారు. ప్రతి కుటుంబ వివరాలు కచ్చితత్వంతో నమోదు చేయాలని, ఎలాంటి పొరపాట్లు లేకుండా డేటాను అప్‌డేట్ చేయాలని సూచించారు. అలాగే సిటిజన్ ఈకేవైసీ కార్యక్రమాన్ని వేగవంతం చేసి ఫీల్డ్ వెరిఫికేషన్ పూర్తి చేసి పెండింగ్ కేసులను వెంటనే క్లియర్ చేయాలని తెలిపారు. పిచ్చాటూరు మండలంలో కీళపూడి స్వర్ణ గ్రామంలో స్వర్ణ గ్రామ/స్వర్ణ వార్డు అధికారి హాజరై యూనిఫైడ్ చేసి సచివాలయం సిబ్బందికి సూచనలు జారీ చేసి వారి నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి, మండల స్వర్ణ గ్రామ అధికారి, స్వర్ణ గ్రామ సిబ్బంది పాల్గొన్నారు.

## పుత్తూరు గ్రంథాలయంలో 28 తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరం



**పుత్తూరు రూరల్, మే 6 ప్రభాతవార్త:** పుత్తూరులోని శాఖా గ్రంథాలయంలో ఈ నెల 28 తేదీ నుంచి వేసవి శిక్షణ శిబిరం జూన్ 6 వరకు జరుగుతుందని గ్రంథాలయ అధికారిణి కె.మీనాకుమారి పేర్కొన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరంలో విద్యార్థులకు పుస్తక పఠనం కథలు చదివించడం, వారిచే కథలు చెప్పించడం, డ్రాయింగ్, ఆర్ట్స్, శతక పద్యాలు, శ్లోకాలు, స్పోకెన్ ఇంగ్లీష్ వంటి అంశాలు నేర్పించడం జరుగుతుందన్నారు. విద్యార్థులు టీవీ, సెల్‌ఫోన్‌లు వంటి వాటికి దూరంగాఉంటూఈ వేసవి క్యాంప్‌లో పాల్గొని తమ సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

## పదవి విరమణ డీఈని సన్మానించిన జిల్లా పంచాయతీరాజ్ అధ్యక్షుడు



**విజయపురం, మే 6 ప్రభాతవార్త:**

నగరిలో పంచాయతీరాజ్ డీఈగా పని చేసి విధులు నిర్వహించిన సుబ్బరాయుడుని బుధవారం ఉమ్మడి చిత్తూరు పంచాయతీరాజ్ ఛాంబర్ అధ్యక్షుడు చుక్కా ధనంజయయాదవ్ శాలువతో తిరుపతిలో సన్మానించి తిరుమల లడ్డు ప్రసాదం అందించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు.

## స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ఫిజిక్స్ విద్యార్థుల మెరుగైన ప్రతిభ

**తిరుపతి విద్య మే 6 ప్రభాత వార్త**



తిరుపతిలోని ఎస్వీయూ లో నిర్వహించిన స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో ఫిజిక్స్ విభాగానికి చెందిన విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభను కనబరిచి విశేష ప్రశంసలు అందుకున్నారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలు, ప్రాజెక్ట్ పనితీరు, సమస్య పరిష్కార సామర్థ్యాలను మెరుగుపరుచుకుని తమ ప్రతిభను చాటారు.ఫిజిక్స్ విభాగాధిపతి ప్రొఫెసర్ దేవ ప్రసాదరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు అంజలి, హరిత, సాయికుమార్, రాజేష్, హరిణి, జాహ్నవి తదితరులు బుధవారం విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు ప్రోగ్రాంలో సాధించిన అనుభవాలు, నేర్చుకున్న నైపుణ్యాల గురించి వివరించారు.విద్యార్థుల ప్రతిభపై సంతోషం వ్యక్తం చేసిన వీసీ ప్రొఫెసర్ నరసింహారావు, రెక్టార్ ప్రొఫెసర్ అప్పారావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతి నాయుడు వారిని అభినందించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం నేర్చుకోవడం ద్వారా దేశానికి ఉపయోగపడే శాస్త్రవేత్తలుగా ఎదగాలని సూచించారు.ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి, ఉద్యోగ అవకాశాల సాధనకు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రోగ్రాంలలో పాల్గొని తమ ప్రతిభను మరింత మెరుగుపరచాలని ఆకాంక్షి ంచారు.ఈ విజయంతో ఫిజిక్స్ విభాగం ప్రతిష్ఠ మరింత పెరిగిందని, ఇతర విద్యార్థులకు కూడా ఇది ప్రేరణగా నిలుస్తుందని అధ్యాపకులు తెలిపారు.

## రాస్‌లో ఘనంగా స్వర్గీయ డాక్టర్ గుత్తా మునిరత్నం 5వ వర్ధంతి

**తిరుపతి కలెక్టరేట్, మే 6 ప్రభాతవార్త :**



రాస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పద్మశ్రీ అవార్డు గ్రహీత స్వర్గీయ డాక్టర్ గుత్తా మునిరత్నం 5వ వర్ధంతి రాస్ సేవా నిలయం నందు ఘనంగా నిర్వహించడం జరిగినది. రాస్ సంయుక్త కార్యదర్శి ఎం. మమత మునిరత్నం విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించడం జరిగినది.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాస్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్. వెంకటరత్నం మాట్లాడుతూ మునిరత్నం తుదిశ్వాస వదిలే వరకు సేవాగుణముతో పేదలు, మహిళలు, వికలాంగులు, రైతులు, అణగారిన వర్గాల వారి అభ్యున్నతికి యెనలేని కృషి చేశారని, వారి ఆశయ సాధనలో భాగంగా బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాలు, క్యాన్సర్ స్క్రీనింగ్ క్యాంప్ లు, రక్తదాన శిబిరాలు వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేయడం జరిగినదని తెలిపారు. ఈ సందర్భంగా జన శిక్షణా సంస్థాన్ ద్వారా టైలరింగు, బ్యూటీషియన్, ఆర్య వర్క్ నందు శిక్షణ పొందిన మహిళలు 60 మందికి సర్టిఫికెట్లను ప్రధానం చేయడం జరిగినది. అరవింద్ కంటి ఆసుపత్రి ద్వారా ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరంలో దాదాపు 150 మంది లబ్ధిదారులను ఆపరేషన్ల కొరకు గుర్తించడమైనది. ఈ కార్యక్రమంలో ఆర్కే ఎంటర్ప్రైజెస్ అధినేతలు బాలాజీ చౌదరి, వెంకటరమణ చౌదరి, రాస్ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

## రోడ్డు ఏర్పడిన గుంతలను పూడ్చిన వామపక్ష నేతలు

**రేణిగుంట, మే 6 ప్రభాతవార్త**



రేణిగుంట పాత చెక్పోస్ట్ వద్ద ఐదు కన్నుల (కణాల) బ్రిడ్జి కింద రాకపోకలు సాగించడానికి తాత్కాలికంగా ఏర్పాటు చేసిన రోడ్డు ఏర్పడిన గుంతలను వామపక్ష నేతలు పూడిపించి బుధవారం మరమ్మత్తులు చేశారు. రేణిగుంట పాత చెక్పోస్ట్ ముఖద్వారం వద్ద ఉన్న రైల్వే బ్రిడ్జిని మరమ్మతుల దృష్ట్యా రైల్వే అధికారులు దారిని మూసివేసిన విషయం తెలిసిందే. అండర్ బ్రిడ్జి మూత కారణంగా రేణిగుంట నుండి శ్రీకాళహస్తి, కడప, చెన్నై వైపు వెళ్లే వచ్చే గ్రామాల ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడ్డాయి. ప్రజలు పడుతున్న ఇబ్బందులను గుర్తించిన వామపక్ష, వైసిపి, నేతలు స్థానికులతో కలిసి జోహో కంపెనీ నుండి పాత చెక్పోస్ట్ రోడ్డు వరకు ఐదు కాణాల బ్రిడ్జి కింద నుండి తాత్కాలికంగా రోడ్డు శ్రమదానంతో రోడ్డు వేశారు. వాహనాలు ఎక్కువగా రాకపోకలు సాగించడంతో రోడ్డు అక్కడక్కడ గుంటల మయంగా మారి రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. దీంతో వామపక్ష నేతలు తాత్కాలికంగా బుధవారం మధ్యాహ్నం వరకు మార్గాన్ని మూసి జెసిపి తో రోడ్డు ను చదును చేశారు. మధ్యాహ్నం నుండి వాహనాలు రాకపోకలు యధాతథంగా సాగించాయి..

## రైతు బాంధవుడు దివంగత పద్మశ్రీ గుత్తా మునిరత్నం..

**రేణిగుంట, మే 6 ప్రభాతవార్త**



రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ చైతన్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రం నందు బుధవారం రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి పద్మశ్రీ గుత్తా మునిరత్నం 5 వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హైదరాబాద్ ఐ సి ఏ ఆర్ అటారి ప్రధాన శాస్త్రవేత్త ఎం ఆర్ రెడ్డి, కృషి విజ్ఞాన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త హెడ్ డాక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ దివంగత పద్మశ్రీ గుత్తా మునిరత్నం రైతు బాంధవుడు అని అన్నారు. ఎలాంటి విభేదాలకు తావివ్వకుండా గాంధీయవాదిగా పేరు తెచ్చుకున్నారన్నారు. ఆయన భౌతికంగా లేకపోయినప్పటికీ ఆయన చేసిన సేవల కారణంగా చరిత్ర పుటల్లో స్థానం సంపాదించారన్నారు. 1981 వ సంవత్సరం రాష్ట్రీయ సేవా సమితి (రాస్ స్వచ్ఛంద సేవా సంస్థ) ను స్థాపించి సమాజంలోని బడుగు బలహీన వర్గాల మహిళలు, పిల్లల కోసం ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి వారిని విద్య, ఆర్థికపరంగా సాధికారత సాధించేలా చేశారన్నారు. వివిధ ప్రాంతాల్లో రైతులను ఆదుకోవడం కోసం 1991 సంవత్సరం కరకంబాడి నందు రాస్ కృషి విజ్ఞాన కేంద్రాన్ని స్థాపించి రైతుల సంక్షేమానికి ఆయన చేసిన కృషి అనిర్వచనీయమని తెలిపారు. కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సిబ్బంది పాల్గొన్నారు.

## తిరుపతిరూరల్లో గంగజాతరల సందడి

**తిరుపతిరూరల్, మే 6 ప్రభాతవార్త:**



తిరుపతిరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో గంగజాతరలు అంగరంగ వైభవంగా నిర్వహించబడ్డాయి. సి.మల్లవరం, పెరుమాళ్ళపల్లి, పేరూరు, అవిలాల, వేదాంతపురం, చిగురువాడ, మల్లంగుంట, పాతకాల్వ, గొల్లపల్లి, రామానుజపల్లి గ్రామ పంచాయతీలలో జాతరలు భక్తి ఉత్సాహాల మధ్య సాగాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిధిగా ఎమ్మెల్యే పులివర్తి నాని హాజరై, గ్రామ దేవత గంగమ్మ తల్లికి సారె సమర్పించి మొక్కులు చెల్లించారు. స్థానిక నాయకులతో కలిసి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామ పంచాయతీలలో జాతరకు విచ్చేసిన ఎమ్మెల్యే నానికి డబ్బులు, వాయిద్యాల మోతతో గ్రామ పెద్దలు ఘనస్వాగతం పలికారు. భక్తులను, గ్రామస్తులను అప్యాయంగా పలకరిస్తూ వారి సమస్యలను కూడా అడిగి తెలుసుకున్నారు. మల్లంగుంటలో అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నాని ప్రారంభించగా, ఇతర గ్రామాల్లోనూ భారీగా భక్తులు పాల్గొని జాతరను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతిరూరల్ టిడిపి అధ్యక్షుడు ఎ.ఈశ్వరరెడ్డి, అలిమినేని మధు తదితరులు పాల్గొన్నారు.

## రైతులకు సబ్సిడి ధరకు పరికరాలు సరఫరా

**నింద్ర, మే 6 ప్రభాతవార్త :**

రైతులకు సబ్సిడి ధరకు రైతులకు సంబందించి పరికరాలు సరఫరా చేయనున్నట్లు మండల వ్యవసాధికారి మురళీక్రిష్ణ తెలిపారు. బుదవారం మండల కేంద్రంలో విలేకర్లు సమావేశంలో మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు ఈనెల 5వతేది నుంచి 19వ తేది వరకు వ్యవసాయ పరికరాలకు రైతు సేవా కేంద్రం నందు ధరఖాస్తూ చేసుకొవలెనని,వ్యవసాయ పరికరాల జాబితా,సబ్సిడి వివరాలు యస్‌సి,యస్‌టి,చిన్న,సన్నకారు రైతులకు 50శాతం మిగతా రైతులకు 40శాతం రాయితీ వ్యవసాయ పరికరాల జాబితా రైతుసేవా కేంద్రం నందు అందుబాటులో కలవు.రైతులు రైతుసేవా కేంద్రం నందు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొవాలని,ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవలని అన్నారు.రైతులకు ఇచ్చే సబ్సిడి మండలానికి 6.61 లక్షలు ప్రభుత్వం ఇస్తుందని అన్నారు.

## బాలికల హక్కులు, బాధ్యతలపై అవగాహన

### కిశోరి వికాసం - ప్రత్యేక వేసవి శిబిరాలు

**చంద్రగిరి, మే 6 ప్రభాతవార్త:**



బాలికల హక్కులు, బాధ్యతలపై అవగాహన కల్పిస్తున్నట్లు ఐసిడిఎస్ సిడిపిఓ పి.ఆర్.ప్రతిమ తెలిపారు. స్థానిక జమండ్లవీధిలో బుధవారం కిశోరి వికాసం - ప్రత్యేక వేసవి శిబిరాలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామ, వార్డు సచివాలయాలలో మే 1 నుండి జూన్ 11 వరకు బాల బాలికల సాధికారత, సమగ్ర అభివృద్ధిని ప్రోత్సహించడంపై ప్రత్యేక శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ముఖ్యంగా మహిళా హక్కులు, లింగ సమానత్వం, సంఘ సేవలు, ఆరోగ్య సంరక్షణ, బాల్య వివాహాల నివారణ, బాలికల రక్షణ, ఫోక్సో యాక్ట్, బాలికలపై లైంగిక వేధింపుల నిరోధక చట్టాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. ఉన్నత విద్యావకాశాలు, వృత్తి మార్గదర్శనం, సైబర్ భద్రత, ఆన్‌లైన్ సురక్ష, ఆర్థిక నిర్వహణ, స్వాలంబన వంటి విషయాలపై అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ ధన, అంగన్‌వాడీ కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## నడివీధి గంగమ్మ జాతరకు పులివర్తి నాని సారె

**చంద్రగిరి, మే 6 ప్రభాతవార్త:**



ఏజి పల్లి గ్రామ నడివీధి గంగమ్మ జాతర వేడుకలలో ఎంఎల్ఏ పులివర్తి నాని అమ్మవారికి సారెను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. మండల పరిధిలోని ఏజి పల్లి, పాత శానంబట్ల గ్రామాలలో మంగళ, బుధవారాలు రెండు రోజులు జాతర వేడుకలు జరుపుకున్నారు. ఈ నేపథ్యంలో జాతర వేడుకలకు హాజరైన ఎంఎల్ఏకి టిడిపి మండల అధ్యక్షుడు ఏజి పల్లి బాల (ముండ్లూరి బాలకృష్ణమూర్తి) ఘన స్వాగతం పలికారు. అదేవిధంగా టిడిపి సీనియర్ నాయకుడు హేమాంబరధరరావు దుశ్శాలువ అలంకరించి స్వాగతం పలికారు. అమ్మవారికి సారెను సమర్పించిన ఎంఎల్ఏ గ్రామస్థులకు చేతులు జోడించి నమస్కరిస్తూ పలకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకుడు, క్లాస్‌వన్ కాంట్రాక్టర్ ఏ.వి.రమణమూర్తి, మార్కెట్‌యార్డు చైర్మన్ గౌస్‌భాషా, టిడిపి నాయకులు వీరంగారి రమేష్‌రెడ్డి, పోతల ప్రవీన్‌కుమార్, మేడసాని కుమార్, పాశం చంద్రకుమార్ నాయుడు, మంగాపురం భాస్కర్, బిజెపి నాయకుడు రాజేంద్రనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

## కానూరులో టిబి ముక్త్ భారత్ అభియాన్



పెళ్లకూరు, మే 6 ప్రభాతవార్త: కేంద్ర ప్రభుత్వం చేపట్టిన టీబి ముక్త్ భారత్ అభియాన్ 100 రోజుల కార్యక్రమంలో భాగంగా పెళ్ళకూరు మండలంలోని కానూరు గ్రామంలో బుధవారం జిల్లా టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ శైలజ ఆదేశాలతో చెంబేడు వైద్యాధికారి టి.చంద్ర మోహన్‌రెడ్డి పర్యవేక్షణలో టీబి లక్షణాలున్న అనుమానితులైన సుమారు 80 మందికి వ్యాధి నిర్ధారణకై స్పాట్ ఎక్స్ రే పరీక్షలు చేశారు. టీబి వ్యాధి పరీక్షలు చేయించుకోవాలని లేనిపక్షంలో తర్వాత జరిగే దుష్పరిణామాలను ఎదుర్కోవాల్సి ఉంటుందని ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో చెంబేడు పిహెచ్‌సి ఎంపీహెచ్ఈఒ ఎస్.కె.రియాజ్, టీవీ సూపర్వైజర్ రమణయ్య, ఆరోగ్య సహాయకులు హరిప్రసాద్, ల్యాబ్ టెక్నీషియన్ రాజా విక్రమ్, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్ఎం ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

# సూళ్ళూరుపేట డివిజన్

## మోడీ పరిపాలన కోరుకుంటున్న దేశ ప్రజలు



వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త : ఈ నెల నాలుగో తేదీ వచ్చిన ఎన్నికల ఫలితాలను బట్టి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారు అని బిజెపి వెంకటగిరి నియోజకవర్గ ఇన్చార్జి ఎస్ఎస్ఎన్ నాయుడు తెలిపారు. పశ్చిమ బెంగాల్లో బిజెపి ఘనవిజయం సాధించడంతో ఆయన వెంకటగిరి పట్టణంలోని బిజెపి కార్యాలయం వద్ద నాయకులు కార్యకర్తలు బాణసంచా కాల్చి, సీట్లు పంపిణీ చేసి సంబరాలు నిర్వహించారు. రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం నుండి విరివిగా నిధులు వస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు దామ గురు ప్రసాద్, పట్టణ పార్టీ అధ్యక్షులు కృష్ణమూర్తి, మాజీ పోలేరమ్మ ట్రస్ట్ బోర్డు సభ్యులు చెంచి తిరుపాలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు తాగునీటిని అందిస్తున్నాం



వాకాడు, మే 6 ప్రభాతవార్త: మండలంలోని అన్ని పంచాయతీలలో వేసవి కాలంలో కూడా సమస్య లేకుండా ప్రజలకు తాగునీటిని పూర్తి స్థాయిలో సరఫరా అందిస్తున్నామని ఆర్డబ్ల్యూఎస్ ఏఈ సుమాంజలి అన్నారు. బుధవారం వాకాడు మండల పరిషత్ కార్యాలయం ఆవరణంలోని స్త్రీశక్తి భవనంలో వైస్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడు వెంకట రమణయ్య అధ్యక్షతన సాధారణ సర్వసభ సమావేశం కార్యక్రమం జరిగింది. ఏవో శ్రీనివాసులు పరివేక్షణలో జరిగిన సాధారణ సర్వసభ సమావేశంలో ఆర్డబ్ల్యూఎస్ సుమాంజలి మాట్లాడుతూ మండలంలోని తీర ప్రాంత గ్రామాలలో సంపులు వివిధ గ్రామాలలో పూర్తి చేసామని, అదేవిధంగా ట్యాంకులు కూడా మంజూరయ్యని, నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకుంటా మన్నారు. సమావేశంలో మండల వివిధ శాఖల అధికారులు మాట్లాడారు. తహసిల్దార్ సయ్యద్ ఇక్బాల్, జడ్పిటిసి సభ్యులు రామకృష్ణ, మండల పరిషత్ వైస్ ప్రెసిడెంట్ నిర్మల, ఎంపీటీసీలు కృష్ణారెడ్డి, గిరి, పిఆర్ఏఈ కిరణ్, ఏపీవో విజయ, ఏవో దీప, పంచాయతీ ప్రత్యేక అధికారులు, శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

## లోకేష్‌కు స్వాగతం పలికిన ఎమ్మెల్యే నెలవల



సూళ్లూరుపేట, మే 6 ప్రభాతవార్త: రాష్ట్ర మంత్రి తెలుగుదేశం పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షులు నారా లోకేష్‌కు స్థానిక ఎమ్మెల్యే నెల వల విజయ శ్రీ బుధవారం శ్రీసిటీకి వచ్చిన సందర్భంగా ఆయనకు ఘన స్వాగతం పలికారు. శ్రీసిటిలో నూతనంగా స్థాపించనున్న క్యారియర్ ఏసి పరిశ్రమకు భూమి పూజ చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా సూళ్ళూరుపేట నియోజకవర్గంలో కొంత వరకు అంతర్భామైన శ్రీసిటిలో మంచి పరి శ్రమలు రావడం సంతోషంగా ఉందని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. రాష్ట్రంలో పరి శ్రమల తీసుకురావడం, ఐటీ రంగాన్ని బలోపేతం చేసే దిశగా లోకేష్ చూపుతున్న శ్రద్ధకు ఎమ్మెల్యే నెలవల ధన్యవాదాలు తెలిపారు.

## లోకేష్‌ని కలిసిన పనబాక దంపతులు



సూళ్లూరుపేట, మే 6 ప్రభాతవార్త: శ్రీ సిటీలో క్యారియర్ ఏసి కంపెనీ భూమి పూజ నిమిత్తం బుధవారం శ్రీ సిటీకి విచ్చేసిన రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేష్‌ను పనబాక దంపతులు మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి పార్ల మెంటరీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు పనబాక లక్ష్మి ఈ సందర్భంగా నారా లోకేష్‌కు జిల్లాలో పార్టీ పరిస్థితి గురించి వివరించారు. పార్టీని మరింత బలోపేతం చేసేం దుకు చర్యలు తీసుకోవాలని లోకేష్ పనబాక లక్ష్మికి సూచించారు.

## పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి



వాకాడు, మే 6 ప్రభాతవార్త: ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి బుధవారం నిర్వహించే స్వచ్ఛ పథం కార్యక్రమంలో భాగంగా రహదారుల పరిసరాలను శుభ్రపరచడం ప్రధాన అంశంగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాకాడు పంచాయతీలో, వాకాడు మెయిన్ బజార్ నుండి అశోక్ స్థూపం వరకు సుమారు 2 కిలోమీటర్ల మేర శానిటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏవో శ్రీనివాసులు మాట్లాడుతూ ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమం ద్వారా ప్రజల్లో స్వచ్ఛతపై చైతన్యం పెంపొందిం చడమే లక్ష్యన్నారు. ఈ కార్యక్రమంలో నెల్లిపూడి పంచాయతీ కార్యదర్శి, స్థానిక రాజకీయ నాయకులు, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

## కొత్త విద్యుత్తు లైను ఏర్పాటు చేయండి

వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త : 14వ వార్డు ఆనందపురం వద్ద కొత్త విద్యుత్తులైన ఏర్పాటు చేయాలని ఆ శాఖ డీఈఈ సీనయ్యకు వైసిపి ఆర్టిఐ విభాగం నియోజకవర్గం అధ్యక్షులు ఆరి శంకరయ్య వినతిపత్రం అందజేశారు. కొత్త విద్యుత్ స్తంభాలు వేసి లైన్ వేయాలని కోరారు. గత కొన్ని సంవత్సరాలుగా తాను విజ్ఞప్తి చేసిన పనిచేయలేదని తెలిపారు. విద్యుత్తు లైన్ ఏర్పాటుకు ఎస్టిమేషన్స్ వేయించినట్లు చెప్పారు.

## మంత్రి లోకేష్‌ను కలిసిన ఎమ్మెల్సీ



వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త: ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్సీ బల్లి కళ్యాణ్ చక్రవర్తి మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీ సిటీకి మంత్రి వచ్చిన సందర్భంగా ఎమ్మెల్సీ కళ్యాణ్ చక్రవర్తి ఆయనను స్వాగతించి పుష్పగుచ్ఛం అందజేశారు. పలుఅంశాలపై మంత్రితో చర్చించారు.

## ఆకట్టుకున్న చిన్నారుల వేద పఠనం



వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త: రాజ వీధిలో వెలసిన భగవాన్ శ్రీ సత్యసాయి సేవా సమితి లో భాగమైన సత్యసాయి బాలవికాస్ వార్షి కోత్సవం భగవాన్ శ్రీశ్రీ సత్యసాయి బాబా వారి మాతృశ్రీ ఈశ్వరమ్మ సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఆంజనేయస్వామిగుడి వీధిలోని శ్రీసాయి వెడ్డింగ్ మహల్ నందు ఈ కార్యక్రమమం నిర్వహించడం జరిగింది. బాల బాలికలు వేద పఠనం అందర్నీ ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవా సమితి కన్వీనర్ శెట్టిపల్లి రామ్మోహన్, బాలవికాస్ గురువులు లీలమ్మ, సుంకర రవికుమార్, ఝాన్సీ, వీణ, మీనాకుమారి, రంజిత, మమత, ప్రియ హర్షిత గీతాలత, భాగ్య లక్ష్మి, తనూజ, వాసు, నాగరాజు, రోహిత్ తదితరులు తల్లిదండ్రులు బాల బాలికలు తదితరులు పాల్గొన్నారు.

## పోటాపోటీగా శ్రీ చెంగాలమ్మ ట్రస్ట్ బోర్డుకు దరఖాస్తులు



సుళ్లూరుపేట, మే 6 ప్రభాతవార్త: సూళ్లూరుపేట లోని శ్రీ చెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ నియామకానికి నోటిఫికేషన్ జారీ కావడంతో ఆశావహులు పోటాపోటీగా దరఖాస్తులు చేసుకుంటున్నారు. ట్రస్ట్ బోర్డుకు ఎస్క్రిక్షియా సభ్యులతో కలిసి 11 మంది ఉండే అవకాశం ఉంది. దీంతో ఆశావాలు దరఖాస్తులను ఇప్పటి వరకు 16 మంది దేవస్థాన కార్యాలయంలో అందజేసినట్లు సమాచారం. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రెండు సంవత్సరాల అనంతరం ట్రస్ట్ బోర్డుకు నోటిఫికేషన్ జారీ కావడం ఇందులో తెలుగుదేశం పార్టీతో పాటు, బిజెపి, జనసేన పార్టీలకు ఒక్కొక్క సభ్యుని చొప్పున కేటాయించవలసి ఉంది. 8 మంది మాత్రం టిడిపికి చెందిన వారికి సభ్యులుగా ఉండేందుకు అవకాశం ఉంటుంది. తెలుగుదేశంలోని వర్గాలను సంతృప్తి పరిచేందుకు అధిష్ఠానం వేనాటి సతీష్ రెడ్డి వర్గానికి సంబంధించి ముగ్గురిని సభ్యులుగా నియమించే విధంగా రాజీ చేసినట్లు తెలుస్తుంది. కాగా బుధవారం పోయినాటి చేసిన సతీష్ రెడ్డితన అనుచరులతో కలసి చెంగాలమ్మకు ప్రత్యేక పూజలు చేసిన అనంతరం దేవస్థానం కార్యాలయంలోతన మద్దతుదారులతో దరఖాస్తులను అందజేశారు. ఇదిలా ఉండగా వేనాటి సతీష్ రెడ్డి వర్గానికి కేటాయించిన సంఖ్య కన్నా ఎక్కువ మంది చేత దరఖాస్తులు వేయించడంతో ఈ విషయం చర్చనీయాంశంగా మారింది.

## నేడు కయ్యూరు గ్రామంలో గ్రీవెన్స్ డే

బాలాయపల్లి, మే 6 ప్రభాతవార్త: మండలంలోని కయ్యూరు గ్రామంలో ఈనెల ఏడో తేదీ గురువారం సచివాలయంలో వన్ మంత్ వన్ విలేజ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ విజయలక్ష్మి తెలిపారు. ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం రెండు గంటల వరకు సచివాలయంలో వినతి పత్రాలు స్వీకరించి నాలుగో గురువారం లోపల పరిశీలించి పరిష్కరిస్తాము అని చెప్పారు. గ్రీవెన్స్‌కు మండలంలోని అధికారులు అందరూ హాజరు కావాలని కోరారు.

## ఒక మాసం...ఒక గ్రామం కార్యక్రమం

వెంకటగిరి, మే 6 ప్రభాతవార్త: మండలంలోని సుద్దవరం గ్రామంలో ఒక ఒక మాసం ఒక గ్రామం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తాసిల్దార్ పి శిరీష తెలిపారు. ఒక మాసం ఒక గ్రామం కార్యక్రమంలో మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొంటారని చెప్పారు. గ్రామాల్లో ఉన్న సమస్యలను ఫిర్యాదు రూపంలో అందిస్తే పరిష్కరిస్తామని తెలిపారు. మండల స్థాయి అధికారులు అందరూ పాల్గొనాలని ఆమె తెలిపారు గ్రామస్తులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## గుర్తు తెలియని వాహనం ఢీకొని...వ్యక్తి దుర్మరణం

పెళ్లకూరు, మే 6 ప్రభాతవార్త: నాయుడుపేట-పూతలపట్టు జాతీయ రహదారిపై దిగువ చావాలి గ్రామ సమీపాన బుధవారం రాత్రి రోడ్డు దాటుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొని దిగువ చావాలి గ్రామానికి చెందిన గోళ్ల రాంబాబు (50) అక్కడికక్కడే మృతి చెందాడు. స్థానికుల ఇచ్చిన సమాచారం ప్రకారం దిగువ చావాలి గ్రామానికి చెందిన గోళ్ల రాంబాబు బుధవారం రాత్రి 8 గంటల సమయంలో రోడ్డు దాటుతుండగా తిరుపతి వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో అక్కడికక్కడే నడిరోడ్డుపై పడి మృతి చెందాడు. అదే సమయంలో వెనక నుండి వెళుతున్న గుర్తు తెలియని వాహనాలు మృతుడు శరీరంపై వెళ్లడంతో శరీరం మొత్తం నుజ్జునుజు అయినట్లు తెలుస్తుంది. మృతుడు రాంబాబు వృత్తిరీత్యా రైతు అని అతనికి ఒక కుమార్తె ఉన్నదని తెలుస్తుంది.

## తాతయ్యగుంట గంగమ్మకు సుధారాణి విరాళం



తిరుపతి, మే 6 ప్రభాతవార్త: తాతయ్య గుంట గంగమ్మ దేవస్థానానికి 60 వేల రూపాయలు నగదునుతో పాటు అమ్మవారికి రెండు పట్టు చీరలు సాయిసుధా మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి ఎండి డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి విరాళంగా ఇచ్చారు. తనయుడు అభిషేక్ తో కలసి ఆమె ఆలయ ఈఓ జయ కుమార్‌కు బుధవారం ఆలయంలో ఈ విరాళం అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ రాళ్లపల్లి సుధారాణి మాట్లాడు తూ ప్రతి సంవత్సరం గంగమ్మ తల్లికి మొక్కులు తీర్చుకోవడం జరుగుతోందని, అందరికి గంగమ్మ తల్లి ఆశీస్సులు మెండుగా ఉండాలని కోరుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది ద్వారక, బోర్డు సభ్యుడు చందు,సిబ్బంది పాల్గొన్నారు.

## గాంధీపురంలో విద్యుత్ షాక్ వ్యక్తి మృతి

తిరుపతిరూరల్, మే 6 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ గాంధీపురం గ్రామ పంచాయతీలో విద్యుత్ షాక్ ఓ వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు బుధవారం మధ్యాహ్నం ఆకాల గాలి వానల వల్ల విద్యుత్ లైన్ తెగి పడటంతో గండికోట ఓబులనాయుడు (66) మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుటుంబానికి ఆధారమైన ఓబులనాయుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు శోకసముద్రం మునిగిపోయారు.

## అవిలాలలో కాలువ భూములపై అక్రమాల కలకలం

**-స్థల పరిశీలన చేసిన అధికారులు -పూర్తిస్థాయి చర్యలు కోరుతున్న ప్రజలు**



తిరుపతిరూరల్, మే 6 ప్రభాతవార్త: తిరుపతి రూరల్ మండలం అవిలాల గ్రామ పంచాయతీలో ప్రభుత్వ కాలువ భూములపై జరుగుతున్న అక్రమణలు స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీశాయి. సర్వేనంబర్ 146లో ఉన్న కాల్వ భూమిని కొంతమంది ఆక్రమించి, నిర్మాణాలు చేపడుతున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ప్రాథమిక సమాచారం ప్రకారం సుమారు 31 సెంట్ల కాల్వ భూములో అక్రమ నిర్మాణాలు చేశారని స్థానికులు ఆరోపించారు. మండల సర్వేయర్ కూడా సర్వే చేసి పక్కాగా కాల్వ భూమినిలో అక్రమ నిర్మాణాలు వెలిసినట్టుగా సర్వేలో వెల్లడించారు. ప్రస్తుతం అక్కడ అంకణం ధర రూ.1.5లక్షల రుపాయాలకు క్రయవిక్రయాలు జరుగుతున్నాయని సమాచారం. కాల్వభూమిని దర్జాగా ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్న ఇటు ఇరిగేషన్ అధికారులు అటు రెవెన్యూ అధికారులు ప్రశ్నించి అడ్డుకోకపోవడం దారుణం. ఇదే గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వేనంబర్ 179/1లో 29 సెంట్లను దర్జాగా ఆక్రమించి ప్రహారీ గోడ ఏర్పాటు చేశారు. కాలువ మార్గాన్ని మట్టితో నింపి ప్లాట్లుగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి. ఈ పరిణామం వల్ల వర్షాకాలంలో నీటి పారుదల అడ్డంకులు ఏర్పడి, సమీప ప్రాంతాల్లో ముంపు ప్రమాదం పెరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫిర్యాదుల నేపథ్యంలో రెవెన్యూ సంబంధిత శాఖ అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిస్థితిని పరిశీలించారు. అక్రమణలు జరిగినట్టు గుర్తించారు. కాలువలను రక్షించకపోతే గ్రామానికి ముప్పు తప్పదని పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే పూర్తిస్థాయి సర్వే నిర్వహించి, ఆక్రమణలను పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ హేమకుమార్, అవిలాల మాజీ సర్పంచ్ సివి రమణ, లింగేశ్వర్‌నగర్ మాజీ సర్పంచ్ ముసుకు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## మామిడి ప్రత్యామ్నాయ పంటలపై రైతులకు అవగాహన

**-మామిడి రైతులకు 6.70 కోట్ల ప్రొటెక్షన్ కవర్లు పంపిణీ-పల్ప్ ఫ్యాక్టరీల యాజమానులతో ఉద్యాన అధికారులు సమీక్ష- కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశం**



చిత్తూరు, మే 6 ప్రభాతవార్త: జిల్లాలో మామిడి పంటకు ప్రత్యామ్నాయంగా అధిక ఆదాయం ఇచ్చే వాణిజ్య, ఉద్యానవన పంటలపై రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో బుధవారం కలెక్టర్ జిల్లాలో మామిడి పంట దిగుబడిపై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఎంఐడిహెచ్ పథకంలోని పాలీ హౌస్ సంబంధించిన బడ్జెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ జిల్లాలో ప్రస్తుతం మామిడి పంట పరిస్థితి, మామిడి పల్ప్ ఫ్యాక్టరీల్లో నిల్వ వున్న మామిడి పల్ప్, ప్యాకింగ్ మెటీరియల్ లభ్యత గురించి ఆరా తీశారు. ఆర్‌కెవివై పథకం అమలులో భాగంగా గత ఆర్థిక సంవత్సరంలో మిగిలి వున్న రూ.50 లక్షల బడ్జెట్‌ను ఖర్చు చేయాలని ఆదేశించారు. అలాగే ఎంఐడిహెచ్ పథకం లోని పాలీ హౌస్ సంబంధించిన బడ్జెట్‌ను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. బంగారుపాళ్యం, కుప్పం, పూతలపట్టు పరిధిలోని మామిడి పల్ప్ యూనిట్ల పరిస్థితిని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసు కున్నారు. ఉద్యానవనశాఖ డిప్యుటీ డైరెక్టర్ రామాంజ నేయుడు, వ్యవసాయశాఖ జెడి మురళీ, ఉద్యానశాఖ ఎడి కోటేశ్వరరావు, మార్కెటింగ్ ఎడి పరమేశ్వరన్, ఇతర ఉద్యానవన శాఖ అధికారులు పాల్గొన్నారు.

## బొజ్జలలేని లోటు తీర్చలేనిది : ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి



శ్రీకాళహస్తి రూరల్, మే 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి నియోజకవర్గ ప్రజలకు జొజ్జల గోపాలకృష్ణారెడ్డి అందించిన సేవలు మరువరానివని ఆయన లేని లోటు తీర్చలేనిదని శాసనసభ్యుడు బొజ్జల వెంకట సుధీర్‌రెడ్డి అభిప్రాయ పడ్డారు. బుధవారం గోపాలకృష్ణారెడ్డి 4వ వర్ధంతి సందర్భంగా ఆయన సమాధి వద్ద హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన తండ్రి సమాధి వద్ద నివాళులర్పిస్తూ కంట తడి పెట్టారు. శ్రీకాళహస్తి శాసనసభ్యుడుగా తనను చూడాలన్నది మా నాన్న ఆశయం అన్నారు. ఆయన ఆశయ సాధనకు తాను కృషిచేస్తున్నానని అభిప్రాయపడ్డారు. ఈ నివాళుల కార్యక్రమ ంలో ఆయనతో పాటు ఆయన సతీమణి రిషితారెడ్డి, తల్లి బొజ్జల బృందమ్మ, కుటుంబ సభ్యులు డాక్టర్ గెరటారెడ్డి, సురేష్‌రెడ్డి, తులసీ రామిరెడ్డి, జడ్‌పిటిసి వెంకటసుబ్బారెడ్డి, శ్రీకాళహస్తి వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మెన్ రంగినేని చెంచయ్యనాయుడు, తాటిపర్తి శంకర్‌జెడ్డి, కన్నలి మోహన్, పార్టీకి చెందిన చిట్టత్తూరు బాలాజిరెడ్డి, ఖాదర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

**స్మార్ట్‌సిటీలో వినూత్నంగా...**

## ఇన్‌ఛార్జి కమిషనర్ ద్విచక్ర వాహనంపై తనిఖీలు



తిరుపతి,మే 6ప్రభాతవార్త: స్మార్ట్‌సిటీ తిరుపతి నగరంలో చెత్తాచెదారంతో ఉన్న ఖాళీ స్థలాలకు నోటీసులు ఇచ్చి శుభ్రం చేయించాలని,, లేకుంటే జరిమానాలు విధించాలని నగరపాలక సంస్థ ఇన్‌చార్జి కమిషనర్ శారదా దేవి అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం నగరంలోని పలు ప్రాంతాల్లో పారిశుధ్య పనులను అధికారులు, సిబ్బందితో కలసి వెళ్లి పరిశీలించారు. కొన్ని ప్రాంతాలకు ఇంచార్జి కమిషనర్ స్వయంగా స్కూటర్‌పై వెళ్లి పారిశుధ్య పనులను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. నగరంలోని పలు ప్రాంతాల్లోని ఖాళీ స్థలాల్లో చెత్తచెదారం వేయడం వలన అపరిశుభ్రంగా ఉందని తెలిపారు. దీంతో దోమలు పెరిగి, అపరిశుభ్రతతో చుట్టుపక్కల ప్రజలు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. వెంటనే శుభ్రం చేయాలని స్థల యజమానులకు నోటీసులు ఇవ్వాలని, లేదా జరిమానాలు విధించి శుభ్రం చేయించాలని అధికారులకు సూచించారు. డ్రైనేజి కాలువల్లో చెత్త నిలబడకుండా ఎప్పటి కప్పుడు శుభ్రం చేయాలని తెలిపారు. అక్రమ నిర్మాణాలను ముందే గుర్తించి అడ్డుకోవాలని, ఎల్.ఆర్.ఎస్. దరఖాస్తులు పరిష్కరించాలని పట్టణ ప్రణాళిక విభాగం అధికారులను ఆదేశించారు. ఇంచార్జి కమిషనర్ వెంట ఆరోగ్య శాఖ అధికారులు, ఎస్పీలు, స్వర్ణ వార్డు కార్యదర్సులు, తదితరులు ఉన్నారు.

## వ్యాపారస్తుల సమస్యల పరిష్కారానికి...చాంబర్ ఎంతో అవసరం





శ్రీకాళహస్తి,మే 6 ప్రభాతవార్త: శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో ఎంతో కాలంగా సాగుతున్న ప్రయత్నం సాకారం అయ్యిందని నూతన ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడుగా ఎన్నుకున్న ఎం.సురేంద్రబాబు (చిట్టి) అన్నారు.బుధవారం పట్టణంలోని సరస్వతి ఆడిటోరియంలో 'ఛాంబర్ ఆఫ్ కామర్స్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం ఏర్పాటు చేసారు.ఈ తిరుపతిజిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ గౌరవాధ్యక్షులు తబ్జుల సుబ్బరామగుప్తా అధ్యక్షత వహించగా ముఖ్య అతిథులుగా శ్రీకాళహస్తీశ్వరాలయ ధర్మకర్తల మండలి చైర్మెన్ కొట్టె సాయిప్రసాద్ తిరుపతి జిల్లా ఛాంబర్ ఆఫ్ కామర్స్ కెవి. చౌదరి, కార్యదర్శి కె.రఘు రామిరెడ్డి, తిరుపతి పట్టణ అధ్యక్షుడు కె.మోహన్‌కుమార్‌రాజు, చార్టెడ్ అకౌంటెంట్ గౌరవ సలహాదారు టి.మల్లికార్జున్‌లు హాజరయ్యారు.ఈ సందర్భంగా తిరుపతి జిల్లా అధ్యక్షుడు కెవిచౌదరి మాట్లాడుతూ ఏ సమస్య అయినా వ్యాపారులు కలసి కట్టుగా ఉంటే పరిష్కరించుకోవచ్చునన్నారు.

**నూతన కార్యవర్గం ప్రమాణం:**

ఈ సందర్భంగా శ్రీకాళహస్తి చాంబర్‌ఆఫ్ కామర్స్ అధ్యక్షుడుగా ముచ్చేలి సురేంద్రబాబు (చిట్టి)చే జిల్లా అధ్యక్షుడు కెవి చౌదరి ప్రమాణం చేయించారు. అలాగే కార్యదర్శిగా మురారి జె.స్వరూప్, కోశాధికారిగా జూలుగంటి మేగ్ దీప్,ఉపాధ్యక్షులుగా లేబూరు ప్రసాద్,కోటిలింగాల శశిధర్,కార్యవర్గ సభ్యులు సుమారు 50 మందితో ప్రమాణ స్వీకారం చేయించారు.ఈ సందర్భంగా అధ్యక్షుడుగా ప్రమాణం చేసిన సురేంద్ర బాబు మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఏర్పాటుకు ఎంతో కాలంగా ప్రయత్నాలు జరిగాయని కానీ పలించలేదన్నారు.నేడు యువత వ్యాపార రంగంలో క్రియాశీలకంగా ఉన్నారని కాబట్టి ఛాంబర్‌ఆఫ్ కామర్స్ సాధ్యమైందన్నారు. అందరం కలసి కట్టుగా ఉందాం ఎవరికి సమస్య వచ్చినా అందరం ఒక్కటిగా ఆదుకుందామని పిలుపు నిచ్చారు.

## సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ ఆధ్వర్యంలో అతిథి ఉపన్యాసం



తిరుపతి హెల్త్, మే 6 ప్రభాతవార్త: శ్రీ వేంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం ఆధ్వర్యంలో శ్రీ పద్మావతి ఆడిటోరియంలో మధ్యాహ్నం అతిథి ఉపన్యాసం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ తెలియజేశారు. స్విమ్స్ సంచాలకులు, ఉపకులపతి డా. ఆర్.వి.కుమార్ మాట్లాడుతూ సికింద్రాబాద్‌కు చెందిన ప్రముఖ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ వైద్య నిపుణులు డా. ఆర్.ఏ. శాస్త్రి శ్రీవారి వైద్య సేవలో భాగంగా స్విమ్స్‌కు వచ్చి మూడు రోజుల పాటు ఎం.బి.బి.యస్.పి.జి. రెసిడెంట్లకు ఇంటరాక్టివ్ సెషన్లు నిర్వహించడం సంతోషదాయకమని తెలిపారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన క్రిష్ణ ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి మరియు అకడమిక్ డైరెక్టర్ ప్రొఫెసర్ డా. ఆర్.ఏ. శాస్త్రి మాట్లాడుతూ సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగం వైద్య విద్యార్థులకు లాప్రోస్కోపీ, రోబోటిక్ ద్వారా శస్త్రచికిత్సలో నైపుణ్యం సాధించడం, క్లినికల్ డేటాబేస్, శస్త్రచికిత్స ఆడిట్, కేస్ క్యాప్సిల్స్ ఉదర సంబంధిత సెప్సిస్ వంటి విషయాలు గుంచి వైద్య విద్యార్థులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మూడు రోజుల పాటు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ పద్మావతి మహిళా వైద్య కళాశాల వైస్ ప్రిన్సిపల్ మరియు జనరల్ సర్జరీ విభాగాధిపతి డాక్టర్ ముత్తీశ్వరయ్య, సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజీ విభాగాధిపతి ప్రొఫెసర్ డా. శివరామక్రిష్ణ డా. వెంకటరామిరెడ్డి, డా. చంద్రమాలీటీశ్వరన్, డా. మనోజ్ కృష్ణ, డా. శ్రీహరి, విభాగపు వైద్యులు, పి.జి. రెసిడెంట్లు, ఎం.బి.బి.ఎస్. విద్యార్థిని, విద్యార్థులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## తాతయ్యగుంట గంగమ్మకు...ఏకవీర సేవా ఫౌండేషన్ సారె



తిరుపతి,మే 6ప్రభాతవార్త: తిరుపతినగర గ్రామదేవత తాతయ్యగుంటగంగమ్మ ఆశీస్సులతో లోకక్షేమం, వర్షాభివృద్ధి, సస్యశ్యామలం, ప్రజలకు ఆయు రారోగ్యాలు కలగాలని ఏకవీర సేవా ఫౌండేషన్ ప్రతాప్ స్వామి ఆకాంక్షించారు. తాతయ్యగుంట గంగమ్మకు మొదలైన జాతర ఉత్సవాల్లో రెండవరోజు బుధవారం ఉదయం ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రతాప్ స్వామి గంగమ్మ తల్లికి భక్తిశ్రద్ధలతో సంప్రదాయబద్ధంగా "సారె" సమర్పించారు. ఈ పవిత్ర సారెలో పట్టుచీరలు, పుష్పాలు, పసుపు కుంకుమలు, పవిత్ర దారాలు, పండ్లు తదితర మంగళ ద్రవ్యాలు సమర్పించి గంగమ్మ తల్లి అనుగ్రహం కోరారు. గంగమ్మమ్మ తల్లి కటాక్షం ప్రజలపై ఎల్లప్పుడూ నిలిచి ఉండాలని ప్రతాప్ స్వామి వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో రాయలసీమ రంగస్థలి చైర్మన్ గుండాల గోపీనాథ్‌రెడ్డి, సభ్యులు తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి,కొట్టే సుబ్రహ్మణ్యంరెడ్డి, మిట్టపల్లి బ్రహ్మానందం, పోలే జనార్ధన్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, టీచర్ తిరుమలయ్య, గోవిందు, ఆది గురు స్వామి, పురోహితుడు సురేష్ స్వామి,కేశవరెడ్డి, రామకృష్ణ తదితరులు వివిధ వేషధారణల్లో పాల్గొని గంగమ్మ తల్లి దివ్య ఆశీస్సులు పొందారు.

## జాతర్ల సందడిలో చెవిరెడ్డి సారె సమర్పణ



తిరుపతిరూరల్, మే 6 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో గంగమ్మ జాతర్లు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గంగజాతరను పురస్కరించుకుని చంద్రగిరి నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి సంప్రదాయంగా సారెను సమర్పించారు. తుమ్మలగుంట శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం నుంచి ప్రతి ఏడాది కొనసాగుతున్న ఆనవాయితీ మేరకు ఈసారి కూడా సారెను తీసుకువచ్చారు. బుధవారం అవిలాల వేదాంతపురం, మల్లంగుంట, చిగురువాడ పంచాయతీల నడివీధి గంగమ్మలకు సారె అందజేశారు. గ్రామ పెద్దలు ఉత్సవ కమిటీ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనం అనంతరం తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వేదాంతపురం మాజీ సర్పంచ్ చెలకుల జనార్దన్ యాదవ్, అవిలాల లోకనాథరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**PALAMANER MUNICIPALITY**

'e' Procurement 2nd Call Tender Notice Roc.No:155/2013/E1, dated: 06.05.2026

**'e' Procurement Tender Notice**

**Tender Notice Nit No: 110&111 Rs.35.50 lakhs**

| | |
|---|---|
| 1. No.of Works | **: 2 No's (SCSP Grant & G.Funds)** |
| 2. T.S.Amount / E.C.V. Amount | **: 35.50Lakhs** |
| 3. Bid Document Downloading Start Date | **: 7.05.2026 at 3.00 P.M.** |
| 4. Bid Document Downloading End Date | **: 15.05.2026 at 3.00 P.M.** |
| 5. Bid Document Submission Closing Date | **: 15.05.2026 at 3.30 P.M.** |
| 6. Price Bid Opening Date | **:15.05.2026 at 3.30P.M.** |

7. Name & Address of the Concerned Officer : Commissioner, Palamaner Municipality, Palamaner - 517408.
Further details can be seen @ e 'procurement market place at https://tender.apeprocurement.gov.in from 07.05.2026 at 10.30 A.M.

**Sd/-Commissioner, Palamaner Municipality**